# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | గురువారం-19- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 23 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## భారత్-కెనడా మధ్య తిరిగి దౌత్య బంధం

- నిజ్జర్ హత్యతో ఏర్పడిన ఉద్రిక్తతలు
- కెనడా ఎన్నికల తర్వాత మారిన రాజకీయ వాతావరణం
- మోదీ కెనడా పర్యటనలో కీలక సమావేశం
- ప్రధానులు మోదీ–కార్నీ మధ్య ద్వైపాక్షిక చర్చలు
- పూర్తి స్థాయి దౌత్య సంబంధాలకు అంగీకారం
- నూతన హై కమిషనర్ల నియామకంపై నిర్ణయం

6లో..



## 'ఐ లవ్ పాకిస్తాన్' అంటూ ట్రంప్ హాట్ కామెంట్

వాషింగ్టన్



ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అయితే, ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటికే భారత్‌పాక్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ఊదరగొట్టిన ట్రంప్ తాజాగా మరోసారి అదే పాటపాడారు.

భారత్‌పాకిస్తాన్ సీజ్‌ఫైర్‌లో అమెరికా జోక్యం చేసుకోలేదని ప్రధాని మోదీ ప్రకటన చేశారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'యుద్ధాన్ని నేనే ఆపా.. ఐలవ్ పాకిస్తాన్.రెండు న్యూక్లియర్ దేశాలు కావడంతో యుద్ధాన్ని ఆపాను. మోదీ గొప్ప వ్యక్తి ఆయనతో రాత్రి మట్లాడా. గత రాత్రే భారత్ అమెరికా ట్రేడ్ గురించి ఆయనతో మాట్లాడాను'అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## అమెరికా జోక్యం చేస్తే విస్తృత యుద్ధమే ?

### ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హెచ్చరిక

- ఇజ్రాయెల్ దాడికి ఖమేనీ తీవ్ర ప్రతిస్పందన
- ఇరాన్ లొంగదు, శిక్ష తప్పదు: సుప్రీం లీడర్ హెచ్చరిక
- ట్రంప్ బెదిరింపులకు భయపడదని టెహ్రాన్ స్పష్టం
- అమెరికా జోక్యం చేస్తే విస్తృత యుద్ధమే
- ఇరాన్‌పై దాడి అంత ఈజీ కాదు: విదేశాంగ శాఖ ప్రకటన
- టెహ్రాన్ దీటైన ప్రతిస్పందనకు సిద్ధంగా ఉంది
- బేషరతుగా లొంగిపోవాలన్న అమెరికా డిమాండ్‌కు ఖమేనీ ఖండ

6లో..



## వ్యక్తిగత హక్కుల ఉల్లంఘనపై న్యాయపరమైన అభ్యంతరం

### ఫోన్లు ఇవ్వడం వ్యక్తిగత హక్కుల హననమే: కేటీఆర్ అభిప్రాయం

- న్యాయవాదులతో చర్చించిన కేటీఆర్
- ఆర్టికల్ 21, ఐటీ చట్టం ప్రకారం డేటా రక్షణ హక్కు
- కోర్టు అనుమతి లేకుండా ఫోన్లు అడగలేరు: న్యాయవాదుల అభిప్రాయం
- రాజకీయ వేధింపుల కోణంలోనే ఈ విచారణ: కేటీఆర్ వాదన

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ ఏసీబీ అధికారుల విచారణను ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కేటీఆర్ ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణలో భాగంగా ఏసీబీ అధికారులు 2021 నవంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు వాడిన ఫోన్లు కావాలని కేటీఆర్‌ను అడిగారు.

మిగతా 2లో..



# బనకచర్ల ప్రాజెక్ట్ పాపం కేసీఆర్‌దే



- కేసీఆర్ ప్రతిపాదనతో ప్రారంభమైన అనుసంధానం
- అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో జలాల పై చర్చలు
- రాయలసీమకు గోదావరి నీటి తరలింపు లక్ష్యమేనా?
- ఏపీ – తెలంగాణ మధ్య అభిప్రాయ భేదాలు
- బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ సీఎం అభ్యంతరాలు
- ఎంపీల భేటీలో తీవ్ర రాజకీయ విమర్శలు
- తెలంగాణ ప్రయోజనాల రక్షణకు కేంద్రంపై ఒత్తిడి
- న్యాయపోరాటానికి తెలంగాణ సిద్ధత
- పార్టీలకు అతీతంగా తీసుకున్న నిర్ణయాలు
- అపెక్స్ కౌన్సిల్ మినట్స్‌ను దుర్వినియోగం చేస్తున్నదెవరు?

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

'ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని కృష్ణా బేసిన్‌లో నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదన దశలోని ప్రాజెక్టులకు వెయ్యి టీఎంసీలకి మించి నీళ్లు అవసరం. ఏటా 3 వేల టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి. నీటి లభ్యత ఉన్న నేపథ్యంలో రెండు రాష్ట్రాలు చర్చించుకుని నీళ్లను వాడుకోవాలని 2016 సెపెట్టంబర్ 21న అప్పటి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఉమా భారతి అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదించారు.

మిగతా 2లో..

## బనకచర్ల ప్రాజెక్టుపై అన్ని పక్షాలతో చర్చించాకే నిర్ణయం : కిషన్‌రెడ్డి

- పోలవరం–బనకచర్ల లింక్‌పై కేంద్ర జలశక్తి మంత్రితో చర్చ
- ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా చర్యలు: పాటిల్ భరోసా
- నిబంధనల ప్రకారం పరిశీలన, అన్ని పక్షాలతో చర్చ తర్వాతే నిర్ణయం
- ఢిల్లీలో కిషన్‌రెడ్డి–సీఆర్ పాటిల్ భేటీ



2లో..

# డిజిటల్ భద్రతకు నూతన ఒరవడి

- హైదరాబాద్‌లో జీసెక్ కేంద్రాన్ని సీఎం రేవంత్ ప్రారంభం
- డిజిటల్ భద్రతకు గూగుల్ తోడ్పాటు అవసరం: సీఎం వ్యాఖ్య
- ఐటీ అభివృద్ధిలో తెలంగాణ లక్ష్యాం ట్రిలియన్ డాలర్ల దిశగా ప్రణాళిక
- గూగుల్‌తో తెలంగాణ ప్రభుత్వం సుదీర్ఘ అనుబంధం
- సురక్షిత డిజిటల్ తెలంగాణ 2.0కు జీసెక్ తోడ్పాటు
- సైబర్ మోసాలకు అడ్డు: శ్రీధర్‌బాబు సూచనలు
- భారత్‌లో నాలుగో, ఆసియా-పసిఫిక్‌లో మొదటి జీసెక్
- జీసెక్ ఏర్పాటుకు అమెరికా పర్యటనలో బీజం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ప్రముఖ ఐటీ సేవల సంస్థ గూగుల్ ప్రారంభంతో ప్రపంచమే మారిపోయి మానవ జీవితం డిజిటల్‌మయంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే, గోప్యత, భద్రతకు డిజిటలైజేషన్ సవాలు విసురుతోందని, డిజిటల్‌గా సురక్షితంగా ఉంటేనే మరింత అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. గూగుల్ దివ్యశ్రీ భవన్‌లో కొత్తగా ఏర్పాటైన 'గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్'(జీసెక్)ను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఉపయోగపడుతుందని సీఎం అన్నారు.

జీసెక్ నైపుణ్యాభివృద్ధితో పాటు ఉపాధి కల్పనకు దోహదం చేస్తుందని, దేశ సైబర్ భద్రత ప్రమాణాలను పెంచుతుందని చెప్పారు. 'చెడు చేయొద్దనే గూగుల్ సంస్థ విధానాన్ని నేను ఇష్టపడతాను. గూగుల్ తరహాలోనే మా ప్రభుత్వం కూడా మంచి పనులు మాత్రమే చేస్తుంది.

మిగతా 2లో..

## కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రిలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### మంజూరు పత్రాలు అందజేయనున్న మంత్రి పొంగులేటి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



భువనగిరి జిల్లా వాసాలమర్రి గ్రామంలో ఇండ్ల నిర్మాణం పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో మోసపోయిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ''వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు 2020 నవంబర్ 1న ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ఆనాడు ప్రకటించారు. 2021 జూన్ 22న గ్రామ సభ నిర్వహించి స్థానికులతో సహపంక్తి భోజనం చేశారు. బంగారు వాసాలమర్రిగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ వాస్తవంగా ఆరోజు నుంచి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయే 2023 డిసెంబర్ 7వ తేదీ వరకు వాసాలమర్రి వైపు కన్నెత్తి చూడలేదని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. ఆయన ఫాంహౌస్‌కు వెళ్లడానికి రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేసి నిలువ నీడ లేకుండా చేశారు. ఆ బాధితులు ఇండ్లు కోల్పోయి తాత్కాలికంగా గుడిసెలు, టెంట్లు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. బంగారు వాసాలమర్రి దేవుడెరుగు..

మిగతా 2లో..



## రాయ్‌పుర్ ఎయిర్‌పోర్టులో సాంకేతిక సమస్య

ఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)

దిల్లీ రాయ్‌పుర్ విమానంలో ఊహించని సమస్య ఎదురైంది. సాంకేతిక కారణంతో విమానం తలుపులు తెరచుకోలేదు. దీంతో అర గంటకుపైగా ప్రయాణికులు అందులోనే ఉండిపోయారు. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌తోపాటు రాయ్‌పుర్ మేయర్ కూడా ఆ సమయంలో ఈ విమానంలోనే ఉన్నారు.

దిల్లీ నుంచి బయలుదేరిన ఇండిగో విమానం 6E6313 బుధవారం మధ్యాహ్నం రాయ్‌పుర్‌లో ల్యాండ్ అయింది. ప్రయాణికులు దిగేందుకు సిద్ధమైనప్పటికీ విమాన తలుపులు మాత్రం తెరచుకోలేదు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బనకచర్ల ప్రాజెక్టుపై అన్ని పక్షాలతో చర్చించాకే నిర్ణయం : కిషన్‌రెడ్డి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన పోలవరంబనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా నిర్ణయం తీసుకుంటామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ భరోసా ఇచ్చారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, భాజపా తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ అంశంపై బుధవారం సాయంత్రం దిల్లీలో సీఆర్ పాటిల్‌తో కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరంబనకచర్ల లింకు ప్రాజెక్టును జలశక్తి మంత్రిత్వశాఖ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని, అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించాకే పారదర్శక పద్ధతిలో నిర్ణయం ఉంటుందని సీఆర్ పాటిల్ చెప్పారని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మెట్రో రెండోదశ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బుధవారం దిల్లీలో పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించారు. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించీ మాట్లాడారు. మెట్రో రెండోదశ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన డీపీఆర్ ఇటీవలే తమకు అందిందని, అధికారులు పరిశీలిస్తున్నారని మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుత డీపీఆర్ పంపి ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకారం అందిస్తుందని ఆయన చెప్పారు.

# బనకచర్ల ప్రాజెక్ట్ పాపం కేసీఆర్‌దే

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. 3 వేల టీఎంసీలు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయని కనిపెట్టింది కేసీఆరే. ఆ నీటి వినియోగంపై నిర్ణయం తీసుకోవాలని సూచించింది ఆయనే. కేసీఆర్ సూచన నుంచే గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినట్స్‌లో కేసీఆర్ చేసిన సూచనలను రికార్డు చేశారని, ఆ మినట్స్ కాపీని ఎంపీలందరికీ అందజేస్తామని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై బుధవారం సచివాలయంలో రాష్ట్ర ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నికర జలాల వినియోగం పూర్తి కాకముందే మిగులు జలాల లభ్యతను ఎలా తేల్చుతారంటూ బీజేపీ ఎంపీ రఘునందర్‌రావు అడిగిన ప్రశ్నకు సీఎం బదులిస్తూ కేసీఆర్‌పై ఆరోపణలు చేశారు.

**గోదావరి జలాల తరలింపే ఆ భేటీల లక్ష్యం**

'చంద్రబాబు, కేసీఆర్ మధ్య సమస్యలు రావడంతో 2016 తర్వాత 3 వేల టీఎంసీల మిగులు జలాల అంశం మరుగున పడిపోయింది. ఆ తర్వాత 2019 ఆగస్టులో నాటి ఏపీ సీఎం జగన్‌తో ప్రగతిభవన్‌లో నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ సమావేశమై మళ్లీ ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం అని ఆ సమావేశంలో కేసీఆర్ అన్నారు. కేసీఆర్, జగన్‌లు ప్రగతిభవన్‌లో నాలుగుసార్లు సమావేశమై గోదావరి జలాలను రాయలసీమకు తరలించుకోవడంపై చర్చలు జరిపారు.

గోదావరి జలాలను కృష్ణా, పెన్నా బేసిన్లకు తరలించడమే నాటి సమావేశాల లక్ష్యం. ఈ నేపథ్యంలోనే బనకచర్ల ప్రాజెక్టును ప్రస్తుతం ఏపీ చేపట్టింది. 400 టీఎంసీలను రాయలసీమకు తరలించాలని అప్పట్లో కేసీఆర్, జగన్ మాట్లాడుకున్నారు. అందులో భాగంగానే బనకచర్ల ప్రాజెక్టు ద్వారా నేరుగా 200 టీఎంసీలు, పరోక్షంగా 100 టీఎంసీలు కలిపి 300 టీఎంసీలను తరలిస్తామంటూ ఏపీ తాజాగా ప్రతిపాదించింది..' అని రేవంత్ చెప్పారు.



**ఆ మినట్స్‌నే గుదిబండగా మార్చాలని ఏపీ చూస్తోంది..**

రాయలసీమకు గోదావరి జలాల తరలింపునకు పెద్దన్నగా సహకరిస్తా అని నాడు కేసీఆర్ హామీ ఇచ్చినట్టు పత్రికల్లో వచ్చిన వార్తలను సీఎం రేవంత్ రెడ్డి చదివి వినిపించారు. దీనిపై బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల దృష్ట్యా గోదావరి జలాలను శ్రీశైలంకు తరలించి.. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు తరలించే ఉద్దేశంతో కేసీఆర్ ఆ ప్రతిపాదనలు చేశారని వివరణ ఇచ్చారు.

బనకచర్లతో తెలంగాణ నష్టపోకుండా ప్రభుత్వానికి సహకరించడానికే తాము ఈ భేటీకి వచ్చామన్నారు. సీఎం జోక్యం చేసుకుని అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినట్స్‌లో ఉన్న అంశాలను మళ్లీ చదివి వినిపిస్తా అని అన్నారు. 'గోదావరి నీళ్లను శ్రీశైలంలో వేయాలంటే తొలుత సాగర్‌లో వేయాల్సి ఉంటుంది. కానీ బనకచర్ల ప్రాజెక్టు ద్వారా సాగర్‌లో వేయకుండా నీళ్లను నేరుగా తరలించుకుంటామని ఏపీ ప్రతిపాదించింది.

రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఏర్పాటైన అపెక్స్ కౌన్సిల్‌లో ఏపీ, తెలంగాణ సీఎంలు చర్చించిన తీసుకున్న నిర్ణయం ప్రకారమే బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తున్నామని ఏపీ వాదిస్తోంది..' అని చెప్పారు. దీంతో.. రాజకీయ ఉద్దేశంతో జరుగుతున్న ఈ సమావేశం నుంచి తాము వాకౌట్ చేస్తున్నట్లు వద్దిరాజు ప్రకటించారు. బీజేపీ ఎంపీ డీకే అరుణ నచ్చజెప్పబోగా, 'పోనీయండి' అంటూ సీఎం వారించారు.

కొన్ని వాస్తవాలు బయటకు వచ్చినందుకు మిత్రుడు కొంత ఇబ్బంది పడ్డట్టు ఉన్నాడని వ్యాఖ్యానించారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినట్స్‌నే తెలంగాణకు గుదిబండగా మార్చడానికి ఏపీ ప్రయత్నిస్తోందని అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299, ఏపీకి 512 టీఎంసీల కేటాయింపులను 2015లో నాటి సీఎం కేసీఆర్ అంగీకరించడంతో తెలంగాణకు తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు.

**జూలైలో ప్రధాని, కేంద్ర మంత్రులను కలుస్తాం**

బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడానికి టెక్నికల్, లీగల్, పొలిటికల్..మూడు మార్గాల్లో ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. గురువారం మళ్లీ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి అభ్యంతరం తెలుపుతామని అన్నారు. ముందస్తుగా నిర్ణయించిన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండడంతో ఈ సమావేశానికి రాలేమని కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు సమాచారం ఇచ్చారని, వారిని సైతం సీఆర్ పాటిల్ వద్దకు తీసుకెళ్తామని చెప్పారు.

జూలైలో జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ప్రధాని మోదీతో పాటు కేంద్ర జలశక్తి, ఆర్థిక, పర్యావరణ శాఖల మంత్రులను కలిసి అభ్యంతరాలు తెలియజేస్తామని వెల్లడించారు. రాజకీయ ప్రయత్నాలు ఫలించకపోతే న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఎంపీ అసదుద్దీన్ సూచించినట్టు జలవివాదాల్లో నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటామని చెప్పారు.

పార్టీలకు అతీతంగా బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఎంపీలందరూ ఈ సమావేశంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిద్దామని ప్రతిపాదించారు. తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించిన తర్వాతే ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరదామన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌లు ఎంపీలను సమన్వయం చేస్తారన్నారు.

కృష్ణా బేసిన్, గోదావరి బేసిన్ ప్రాజెక్టులపై ఒక డాక్యుమెంట్ తయారు చేసి ఎంపీలందరికీ అందించాలని ఆదిత్యనాథ్‌ను ఆదేశించారు. సీఎం ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్తాడంటూ విమర్శలు చేస్తున్నారని, నిరంతరం వెళ్లి సంప్రదింపులు చేస్తేనే ప్రాజెక్టులకు అనుమతులు వస్తాయని సీఎం అన్నారు.

భవిష్యత్తులో సైతం కేంద్రంతో సంబంధాలు కొనసాగిస్తామన్నారు. కాంగ్రెస్ ఎంపీలు రేణుకా చౌదరి, మల్లు రవి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, రఘురాం రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ, రఘునందన్ రావు, ఎంఐఎం నుంచి అసదుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు.

# వ్యక్తిగత హక్కుల ఉల్లంఘనపై న్యాయపరమైన అభ్యంతరం

(మొదటి పేజీ తరువాయి)



wఇదే అంశంపై కేటీఆర్ బుధవారంఏసీబీ అధికారులకు లేఖ రాశారు. ఆ లేఖలో 2024లో ఫోన్లు మార్చాను. గతంలో వాడిన ఫోన్లు నా దగ్గర లేవు. 2021 నవంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు వాడిన ఫోన్లు కావాలని అడిగిన ఏసీబీ. ఫోన్లు అడగడం అంటే వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్లేనని అందులో పేర్కొన్నారు.

ఏసీబీ అధికారులు ఫోన్లను అడగడంపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చించినట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో 'విచారణ సంస్థలు ఒక పౌరుడి నుంచి సేకరించిన సమాచారాన్ని తిరిగి అదే పౌరునిపై వాడే కుట్ర చేయడం అన్యాయమని గతంలో కోర్టులు పలు తీర్పులు ఇచ్చాయి. వ్యక్తిగతంగా వాడే ఫోన్లను కోర్టు తీర్పు లేకుండా ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ఐటీ చట్టం ప్రకారం ఏసీబీ తీరు వ్యక్తిగత హక్కులకు విఘాతం కలిగిస్తుంది. ఈ చట్ట ప్రకారం కేవలం కోర్టు తీర్పుతోనే విచారణ సంస్థలు మొబైల్, ల్యాప్‌టాప్ లాంటి వ్యక్తిగత ఉపకరణాలు అడగవచ్చు. ఎలాంటి ప్రజాప్రయోజనం లేని సందర్భంలో విచారణ సంస్థలు ఇలాంటి ఆదేశాలు ఇవ్వలేవన్నారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ వేధింపుల కోణంలో జరుగుతోంది' అని కేటీఆర్‌కు న్యాయవాదులు వివరించినట్లు సమాచారం.

# డిజిటల్ భద్రతకు నూతన ఒరవడి

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన ప్రాంతం తెలంగాణ రాష్ట్రం. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చేదిశగా మా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మహిళలు, రైతులు, యువత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు గూగుల్ మద్దతును కోరుతున్నా. తెలంగాణతో గూగుల్ సంస్థకు సుదీర్ఘ అనుబంధం ఉంది. విద్య, భద్రత, మ్యాప్‌లు, ట్రాఫిక్, స్టార్టప్‌లు, ఆరోగ్యం.. ఇలా అనేక రంగాలలో గూగుల్‌తో కలిసి పనిచేస్తున్నాం. గూగుల్ ఒక వినూత్న సంస్థ, మాది ఒక వినూత్న ప్రభుత్వం'అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**ఏఐ యుగంలో సైబర్ సెక్యూరిటీ సవాలు: శ్రీధర్‌బాబు**

టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కేకొద్దీ అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఒక్క క్షణం అప్రమత్తంగా లేకపోయినా సైబర్ మోసాల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ హైదరాబాద్‌లో ఆసియా పసిఫిక్ ప్రాంతంలోనే మొదటి జీసెక్‌ను ఏర్పాటు చేయడం ఆహ్వానించదగిన పరిణామమని అన్నారు.



'సేఫ్ డిజిటల్ తెలంగాణ 2.0'లక్ష్యానికి అనుగుణంగా పాఠశాల స్థాయి నుంచే సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో ఎంపీ మల్లు రవి, గూగుల్ వైస్ ప్రెసిడెంట్లు అరిజీత్ సర్కార్, హీతర్ అడ్కిన్స్, విల్సన్ వైట్, గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లబానా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

**భారత్‌లో తొలి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్**

గూగుల్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్లలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినది నాలుగోది. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో ఇదే మొట్టమొదటిది కావడం గమనార్హం. గత ఏడాది ఆగస్టులో సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో భాగంగా గూగుల్ హెడ్ ఆఫీసును సందర్శించిన సమయంలో హైదరాబాద్‌లో జీసెక్ ఏర్పాటు కోసం చొరవ చూపారు. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన 'గూగుల్ ఫర్ ఇండియా 2024'సదస్సులో భారత్‌లో జీసెక్ ఏర్పాటు చేస్తున్నట్లు గూగుల్ ప్రకటించింది. దీని ఏర్పాటుకు గత ఏడాది డిసెంబర్ 4న తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

అంతర్జాతీయ సెక్యూరిటీ హబ్‌గా జీసెక్ అధునాతన భద్రత, ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తుల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రత, అత్యాధునిక పరిశోధన రంగంలో పనిచేస్తున్న నిపుణులకు ఇది సహకార వేదికగా ఉపయోగపడుతుంది. జీసెక్ ద్వారా ఐటీ రంగంలో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాల కల్పన జరుగుతుంది.

# కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రిలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఇండ్లను కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అక్కున చేర్చుకుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి ఆదేశాల మేరకు వాసాలమర్రి గ్రామంలో సర్వే నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు అర్హులను గుర్తించడం జరిగింది. అర్హులైన 205 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశాం. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను గురువారం నాడు నేనే స్వయంగా వారికి అందజేస్తున్నాను. దేశానికి దశ దిశ చూపిస్తా అని ప్రగల్బాలు పలికిన కేసీఆర్ దత్తత గ్రామ ప్రజలకు పంగనామాలు పెట్టారు. కొత్త ఇల్లు రాలేదు.. ఉన్న ఇల్లు పోయింది. ప్రజల అవసరాలను ఆశలను వారి రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకున్నారని చెప్పడానికి వాసాలమర్రి గ్రామమే ఒక నిదర్శనం'' అని అన్నారు.నేడు క్షేత్రస్థాయిలో పర్యటన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం నాడు రెండు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బండ సోమారం, సూర్యాపేట జిల్లా మోతే మండలంలోని విభలాపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించనున్నారు. అర్హులైన 205 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశాం. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను గురువారం నాడు నేనే స్వయంగా వారికి అందజేస్తున్నాను. దేశానికి దశ దిశ చూపిస్తా అని ప్రగల్బాలు పలికిన కేసీఆర్ దత్తత గ్రామ ప్రజలకు పంగనామాలు పెట్టారు. కొత్త ఇల్లు రాలేదు.. ఉన్న ఇల్లు పోయింది. ప్రజల అవసరాలను ఆశలను వారి రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకున్నారని చెప్పడానికి వాసాలమర్రి గ్రామమే ఒక నిదర్శనం'' అని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం నాడు రెండు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బండ సోమారం, సూర్యాపేట జిల్లా మోతే మండలంలోని విభలాపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించనున్నారు.



# రాయ్‌పూర్ ఎయిర్‌పోర్టులో సాంకేతిక సమస్య

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై సిబ్బందిని ప్రశ్నించగా.. సాంకేతిక సమస్య తలెత్తిందని, తెరిచేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దీంతో ప్రయాణికులు కొంత ఆందోళనకు గురయ్యారు. చివరకు బయటనుంచి సిబ్బంది వచ్చి డోర్లు తెరవడంతో లోపలున్నవారంతా ఊపిరి పీల్చుకున్నారు.

విమానం కూలిన చోట 70తులాల బంగారం సేకరించి.. మానవత్వం చాటి..! ఇలా విమానం ఎయిర్‌పోర్టులో దిగిన తర్వాత దాదాపు 40 నిమిషాల పాటు ప్రయాణికులు అందులోనే ఉండిపోయారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం భూపేష్ బఘేల్ పేర్కొన్నారు. రాయ్‌పూర్ మేయర్ మీనాల్ చౌబే మాట్లాడుతూ..




దీనిపై ఏవిధమైన భయం లేనప్పటికీ, అహ్మదాబాద్ ఘటన తర్వాత చిన్న సమస్యలు కూడా ఆ విషాదాన్ని గుర్తుచేస్తున్నాయని అన్నారు. ఈ పరిణామంపై ఇండిగో విమానయాన సంస్థ స్పందించింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో డోర్లు తెరచుకోలేదని, ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామంటూ ఓ ప్రకటనలో పేర్కొంది.

# ఎజెండా అంశాలు దాచిపెట్టి ప్రజలను మోసం చేస్తున్న సీఎం రేవంత్: హరీశ్‌రావు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా ఎపెక్స్ కౌన్సిల్ మీటింగ్ ఎజెండా 5లోని అంశాలు దాచి పెట్టి, ఎజెండా 1 అంశాలను మాత్రమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. ఎంపీల సమావేశంలో, మీడియా సమావేశంలోనూ సీఎం తన అబద్ధాల ప్రవాహాన్ని యథేచ్ఛగా కొనసాగించారని బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ''బోడిగుండుకు మోకాలుకు లంకె పెట్టి మాట్లాడటంలో రేవంత్‌రెడ్డి సిద్ధహస్తులని మరోసారి రుజువైంది. ఎపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కేసీఆర్ చెప్పిన వాటిని ముఖ్యమంత్రి వక్రీకరించారు. రాజకీయ లబ్ధి పొందాలనే వక్ర బుద్ధే తప్ప.. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలనే తపన రేవంత్‌కు లేదు. గోదావరికృష్ణా నదుల అనుసంధానం



ప్రాజెక్టుల విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు పోకూడదని, ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించదని కేసీఆర్ ఎజెండా 5లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని కావాలని దాచిపెట్టి, స్వార్థపూరిత రాజకీయ లక్ష్యాల కోసం సీఎం అసత్యాలను ప్రజల ముందు ఉంచారు. మీడియాను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. అబద్ధాల పునాదుల మీద జరిగిన ఈనాటి రేవంత్ తతంగాన్ని ప్రజలు విశ్వసించరు'' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ చేస్తాం



- మూడు రోజుల్లో 86.92 లక్షల ఎకరాలకు 5,215 కోట్లు రైతుల ఖాతాల్లో వేసాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

9 రోజుల్లో 9,000 కోట్ల రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాలో జమ చేసి తీరుతామని డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన మధిర నియోజకవర్గం బోనకల్ మండలం జానకి పురంలో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. ఈనెల 16న ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతు సోదరులకు పెట్టుబడి సహాయంగా రైతు భరోసా నిధులను జమ చేస్తూ వస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు.

రాష్ట్రంలో సాగు యోగ్యమైన 1,49,39,11 కోట్ల ఎకరాలకు తొమ్మిది వేల కోట్లు జమ చేయనున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అన్నదాతల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, రైతు బీమా వంటి కార్యక్రమాలతో ప్రతి సంవత్సరం రైతుల కోసం 70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం, ఐదు సంవత్సరాల కాలంలో రైతుల కోసం మూడున్నర లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. పదేళ్లు పరిపాలించిన వారు వరి వేస్తే ఉరే అన్నారు, మేము వ్యవసాయాన్ని పండుగల మారుస్తున్నాం, సరిగ్గా వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను జమ చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చి వరి ఉత్పత్తి పెంచి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాం అన్నారు. వరితోపాటు ఇతర పంటల ఉత్పత్తి రాష్ట్రంలో గణనీయంగా పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.

# బ్యాంకులు వచ్చే సంవత్సరం పూర్తి లక్ష్యాలను సాధించాలి

- వచ్చే సంవత్సరానికి రూ.6517.51కోట్లతో జిల్లా వార్షిక రుణప్రణాళిక.
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.

మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు,

ప్రాధాన్యతా రంగానికి బ్యాంకులు వచ్చే సంవత్సరం పూర్తి లక్ష్యాలు సాధించడానికి చిత్త శుద్ధితో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. వచ్చే వార్షిక సంవత్సరానికి 6517.51 కోట్ల రూపాయలతో జిల్లా వార్షిక రుణప్రణాళికను నిర్ణయిస్తూ జిల్లా వార్షిక రుణప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ హాలులో సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకు మేనేజర్స్, వివిధ బ్యాంక్ కంట్రోలర్ తో బ్యాంకుల రుణవితరణ మరియు బ్యాంకు లింకేజీకి ఉన్న ప్రభుత్వ పథకాలపై డీసీసీ/డిఎల్ఆర్సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాజీవ్ యువ వికాస పథకం, స్వయం ఉపాధి, వివిధ రంగాలలో లక్ష్యాలు నిర్దేశించుకుని రుణాలు అందించాలని తెలిపారు. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ రైతాంగానికి లోన్లు మంజూరు చేయాలన్నారు. కోటి మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు అధిక మొత్తంలో రుణాలు అందించి తోడ్పాటునందించాలని తెలిపారు. జిల్లా వార్షిక ఋణ ప్రణాళిక 202425 ప్రకారం వివిధ రంగాలలో రూ. 5857 కోట్లు రుణాల లక్ష్యం ఉండగా రూ 4366.84 కోట్లు (74.55%) రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందులో వ్యవసాయతర రుణాల లక్ష్యం రూ. 3647.75 కోట్లు ఉండగా, మెదక్ జిల్లాలో రూ. 2857.75 కోట్లు (78.34%) మంజూరు చేయటం జరిగిందాని, పంట రుణాల లక్ష్యం రూ. 2267.25 కోట్లు ఉండగా, మెదక్ జిల్లాలో రూ. 1603.80 కోట్లు (70.74%) మంజూరు చేయదం జరిగిందని చెప్పారు. ప్రణాళిక ప్రకారం ఋణాలు మంజూరు చేయడంలో చొరవ చూపుతున్న బ్యాంకర్స్ ని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం 2025 26 వార్షిక ఋణ ప్రణాళికను ఆవిష్కరించారు. మొత్తం జిల్లా వార్షిక ఋణ ప్రణాళిక 202526 కు రూ 6517.51 కోట్లు కేటాయించగా పంట రుణాలు రూ. 1977.46 కోట్లు, వ్యవసాయ రుణాలు రూ 3971.05 కోట్లు, ప్రాధాన్యత రంగానికి రూ. 5481.60 కోట్లుగా కేటాయించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్డీఓ శ్రీనివాస్, ఎల్ డి యం. నరసింహ మూర్తి, డీడీఎం నాబార్డ్ కృష్ణ తేజ, ఎల్డిఓ ఆర్బీఐ శ్రావ్య, వివిధ వాణిజ్య, సహకార మరియు ఆర్.ఆర్.బీ బ్యాంకుల కంట్రోలర్స్, బ్రాంచ్ మేనేజర్ లు, ఇతర సీనియర్ డిస్ట్రిక్ట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.






# మెరుగైన విద్యుత్ సేవలకు రియల్ టైం ఫీడర్ మేనేజ్మెంట్, ఫాల్ట్ పాసెజ్ ఇండికేటర్స్...

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు.
- మధిర నియోజకవర్గం జానకిపురం సబ్ స్టేషన్ లో ప్రారంభించిన డిప్యూటీ సీఎం.

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:




విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తు సరఫరా, అంతరాయం ఏర్పడితే వెను వెంటనే గుర్తించి మరమ్మత్తులు చేసేందుకు రియల్ టైం ఫీడర్ మేనేజ్మెంట్ సిస్టం (టి ఆర్ ఎఫ్ ఎం ఎస్), ఫాల్ట్ పాస్ ఏజ్ ఇండికేటర్స్ (ఎఫ్ పి ఐ) లు ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర డిప్యూటీ సీఎం, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర నియోజకవర్గం బోనకల్లు మండలం జానకిపురం సబ్ స్టేషన్ లో టి ఆర్ ఎఫ్ ఎం ఎస్, ఎఫ్ పి ఐ వ్యవస్థలను, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి లతో కలిసి డిప్యూటీ సీఎం ప్రారంభించారు.

ఈ ఆధునిక పరిజ్ఞానాన్ని ఎన్పిడిసిఎల్, ఎస్పీడిసిఎల్ రెండు సంస్థల పరిధిలో అమలు చేయనున్నట్టు తెలిపారు. ఎక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయిందో కంప్యూటర్ ద్వారా గుర్తిస్తారని, ఎన్పిడిసిఎల్, ఎస్పీడిసిఎల్ కార్యాలయంలోని డాష్ బోర్డు ద్వారా కూడా రాష్ట్రంలో ఎక్కడ విద్యుత్ సమస్య ఏర్పడినా గుర్తించే అవకాశం ఈ ఆధునిక వ్యవస్థల ద్వారా వీలవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.



రియల్ టైం ఫీడర్ మేనేజ్మెంట్ సిస్టం అనేది సబ్ స్టేషన్లలోని ఫీడర్ల పర్యవేక్షణ, నియంత్రణ, రక్షణ మరియు రియల్ టైం ప్రాతిపదికన సమాచారాన్ని తీసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన ప్రతి సమాచారం కంప్యూటర్ ఆధారితంగా నమోదు అవుతుందని తెలిపారు. ఈ వ్యవస్థ వినియోగదారులకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా ఎక్కడైనా విద్యుత్ సరఫరా లో సమస్య ఏర్పడితే విద్యుత్ సిబ్బంది వేను వెంటనే ప్రతిస్పందించేందుకు సహకరిస్తుందని వివరించారు. మొదట రాష్ట్రంలోని 100 సబ్ స్టేషన్లలో ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇకపోతే మరో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఫాల్ట్ పాసెజ్ ఇండికేటర్ అనేది విద్యుత్తు సరఫరా లో సమస్యను అతి త్వరగా గుర్తించడానికి, ఏ ప్రాంతంలో సమస్య ఏర్పడిందో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది అన్నారు. ఈ వ్యవస్థ ద్వారా విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాన్ని గుర్తించే సమయం గననీయంగా తగ్గుతుందని తెలిపారు. విశ్వసనీయతను మెరుగుపరచడానికి, విద్యుత్ సరఫరాను అతి త్వరగా పునరుద్ధరించడంలో సహాయపడుతుందని తెలిపారు. మొదటి దశలో 25 కిలోమీటర్ల కంటే ఎక్కువ పొడవైన 33కెవి & 11కెవి ఫీడర్లలో లోపాలను త్వరగా గుర్తించి సరఫరాను పునరుద్ధరించడానికి 1000 ఎఫ్పిఐ లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

ఎస్సై శంకర్..

మెదక్ బ్యూరో/ అల్లాదుర్గం. తెలంగాణ ముచ్చట్లు,

మండల ప్రజలు యువత సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శంకర్ తెలిపారు. బుధవారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజలకు, బాధితులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులు ఫోన్ కాల్ చేస్తే ఓటిపిలు షేర్ చేయకూడదని, బ్యాంకు వివరాలు, తెలుపరాదని వివరించారు. సైబర్ నేరాల గురైనప్పుడు టోల్ ఫ్రీ 100 నెంబర్ కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.



# తుంగభద్రా ఒడ్డున దర్జాగా సాగుతున్న ఇసుక మాఫియా

- ప్రజలతోపాటు బలహీన వర్గాల ఆవేదన
- అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం

జోగులాంబ గద్వాల్,తెలంగాణ ముచ్చట్లు:

రాయలసీమతెలంగాణ సరిహద్దులో ఉన్న తుంగభద్రా నది ఒడ్డున రాజోలి వద్ద అక్రమ ఇసుక రవాణా మాఫియా దర్జాగా సాగుతోంది. సుంకేసుల డ్యాం సమీపంలోని ఈ ప్రాంతం ఇసుక మాఫియాకు అడ్డా గా మారిన తీరు స్థానిక ప్రజలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఇసుకను అక్రమంగా తవ్వుతూ ట్రాక్టర్లలో రాత్రింబవళ్ళు తరలిస్తుండటంతో చుట్టుపక్కల దుకాణాలు, నివాస ప్రాంతాల వద్ద దుమ్ముతో మునిరిపోతున్నాయని, బస్టాండ్ దగ్గర రోడ్లు, కాలువలు పూర్తిగా జమ్మిపోయాయని స్థానికులు గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. ఇది సరిపోదన్నట్టు ట్రాక్టర్లను నడిపే కొందరు వ్యక్తులు మద్యం సేవించి, సెల్ఫోన్లలో మాట్లాడుతూ అత్యంత వేగంగా డ్రైవ్ చేయడం వల్ల బస్టాండ్ ప్రాంతాల్లో ప్రమాద భయం నెలకొంది. దీనివల్ల ప్రజలు రోడ్డుపై నడవాలన్నా, షాపుల దగ్గర నిలబడాలన్నా భయంతో వణికిపోతున్నారు.

స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని, తాము చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. “చూసి మాదిరిగా చూస్తున్నారు, కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు” అని మండిపడుతున్నారు.

ఈ పరిస్థితులన్నీ అధికారులు గమనించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బహిరంగంగా ధర్నా చేపడతామని గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ ఇసుక రవాణాపై పూర్తిగా నియంత్రణ విధించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# గోమారం లో మండల స్థాయి క్రీడా పాఠశాల విద్యార్థులఎంపికలు!

- ఎంఈఓ బుచ్చా నాయక్!!

మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు,

శివంపేట మండల కేంద్రంలోని గోమారం లోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోక్రీడా పాఠశాలలకు 4 వ తరగతి చదువుతున్న మండలంలోని విద్యార్థులకు దేహ దారుఢ్య పరిక్షలు నిర్వహి 20 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 23 నుండి 26వ తేది వరకు ' జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించడం జరుగుతుంది. అని ఎంఈఓ బుచ్చన్ నాయక్ అన్నారు ఈ ఎంపిక కార్యక్రమంలో 60 మంది విద్యార్థులు పలు ప్రాథమిక పాఠశాలల నుండి పాల్గోన్నారు. స్థానిక మండల విద్యాధికారి బుచ్చా నాయక్ సమక్షంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోమారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి మండలంలోని పిబిలు కిషోర్ కుమార్ లతీఫా, శ్రీధర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాద్యాయు సురేష్, సాల్మానా రాజ్, రాం చంద్రరెడ్డి, నర్స గౌడ్, యాదవ రెడ్డి, మంజుల శేఖర్ మరియు సి ఆర్ పి లు తదితరులు పాల్గోన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఊరికో బస్సు... ఇంటికో దీపం అనే నినాదంతో పని చేస్తున్నాం...

**డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు**
**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఊరికో బస్సు... ఇంటికో దీపం అనే నినాదంతో పని చేస్తున్నామని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మధిర పట్టణంలో 10 కోట్ల రూపాయలతో చేపట్టిన బస్ స్టాండ్ నిర్మాణ పనులకు, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ 1987 లో మొదలైన మధిర డిపో అంచెలంచెలుగా ఎదిగిందని అన్నారు. 1978 లో మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలో ఊరికి ఒక బస్సు ఇంటికి ఒక దీపం అనే స్లోగన్ తో ప్రభుత్వం ఏర్పాటు జరిగిందని అన్నారు. ఆర్టీసీని ప్రజా ప్రభుత్వం ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, గత పాలకుల వివక్షను అధిగమిస్తూ నేడు ఆర్టీసీ బాగు పడుతుందని అన్నారు. సామాన్యులకు రవాణా సౌకర్యం కల్పించే వేదిక ఆర్టిసి మాత్రమేనని అన్నారు. 10 సంవత్సరాల గత ప్రభుత్వ పాలనలో ఆర్టీసీ తీవ్రంగా నష్టపోయిందని, రవాణా శాఖ మంత్రివర్యులు చేసిన కృషి ఫలితంగా నేడు లాభాల బాట పట్టిందని అన్నారు. మహిళలు ఎక్కడికి వెళ్లినా ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం ఆర్టీసీ బస్సులలో కల్పించామని అన్నారు. ప్రజా ప్రభుత్వం 6210 కోట్ల రూపాయలను మహిళల బదులు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా మధిర పట్టణంలో ఆధునిక వసతులతో బస్టాండ్ నిర్మించేందుకు 10 కోట్ల రూపాయలు మంజూరు చేసిన రవాణా శాఖ మంత్రికు డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. డీజిల్ తో నడిచే బస్సుల నుంచి ఎలక్ట్రిక్ బస్సులకు క్రమ పద్ధతిలో ప్రభుత్వం మారుతుందని, మహిళా సంఘాల ద్వారా 600 ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసి ఆర్టీసీ సంస్థకు అద్దెకు అప్పగించి వారి ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు తయారు చేశామని అన్నారు.

మధిర పట్టణంలో భవిష్యత్తులో అవసరమైన నూతన బస్సులను ఇక్కడి డ్వాక్రా సంఘాల ద్వారా మాత్రమే కొనుగోలు చేస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ నూతన బస్సు రూట్ లను ప్రతిపాదించాలని అన్నారు. ఆర్టీసీ బస్సు స్టాండ్ లలో రూఫ్ టాప్ పై సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మధిర పట్టణంలో బస్టాండ్ రికార్డు సమయంలో పూర్తి చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.

కార్యక్రమంలో రవాణ, బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 1987 లో 4 బస్సులతో ప్రారంభమైన మధిర బస్ స్టాండ్ నేడు 70 బస్సుల స్థాయికి చేరిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటలలోగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని అన్నారు. గత పాలకుల హయాంలో నూతన బస్సు కొనకుండా, ఆర్.టి.సి. ఆర్థికంగా చాలా నష్టపోయిందని అన్నారు.

మహాలక్ష్మి పథకం వల్ల బస్సులకు మరోసారి డిమాండ్ పెరిగిందని, నూతన బస్సులు మహిళా సంఘాల ద్వారా కోనుగోలు చేస్తున్నామని అన్నారు. ప్రతి నెల దాదాపు 300 కోట్ల రూపాయలు ఆర్టిసికు మహాలక్ష్మి పథకం క్రింద ప్రభుత్వం చెల్లిస్తున్నదని అన్నారు. ఆర్టీసీలో నూతన బస్సులు కొనుగోలు చేయడమే కాకుండా బస్టాండ్ వంటి సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆర్టిసి కార్మికుల కృషి ఫలితంగా ప్రతిరోజు లక్షల మంది గమ్యస్థానం చేరుకుంటున్నారని, ఖమ్మం జిల్లాలో రోజూ రెండు లక్షలకు పైగా ప్రజలు ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేస్తున్నారని, వీరిలో లక్షా 32 వేల మంది మహిళలు ఉంటారని అన్నారు. గ్రామీణ ప్రజలకు లైఫ్ లైన్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అని, మధిర పట్టణంలో 10 ప్లాట్ ఫాం, వెయిటింగ్ రూమ్, టాయిలెట్స్ వంటి ఇతర సదుపాయాలతో బస్టాండ్ నిర్మాణం జరుగుతుందని అన్నారు.

అనంతరం డిప్యూటి సీఎం, మంత్రులు బస్సులను ప్రారంభించి ప్రయాణికుల సీట్లలో కూర్చొనీ కొద్ది దూరం ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహారావు, కరీంనగర్ జోన్ టిజిఎస్ ఆర్టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలోమన్, ఆర్టీసీ ఇంజనీరింగ్ అసెట్ మేనేజ్మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెరుకుపల్లి వెంకన్న, ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ అజ్మీరా సరిరాం, ఆర్టీసీ చీఫ్ సివిల్ ఇంజనీర్ జోగు భాస్కర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# అవధులు లేని ఆనందంలో అన్నదాత

- **రైతుల ఖాతాలలో వానాకాలం పంట పెట్టుబడి నిధులు జమ.**
- **జిల్లాలోని 2,25,490 మంది రైతుల ఖాతాలలో రూ.134.43 కోట్ల నిధులు ఇప్పటికే జమ.**
- **రైతు భరోసాతో అన్నదాతకు ఆదరువు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**

**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు,**




వ్యవసాయాన్ని పండుగలా మారుస్తూ, రైతులకు బాసటగా నిలవాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన మెదక్ జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తోందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.

వానాకాలం 2025 సీజన్ కు సంబందించి పంట పెట్టుబడి సాయం క్రింద జిల్లాలో అర్హులైన అందరి రైతులకు నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తోందని అన్నారు. రైతుల బ్యాంకు ఖాతా వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే రైతు భరోసా పోర్టల్ లో నమోదు చేశారని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ వివరాలకు అనుగుణంగా మంగళవారం సాయంత్రం వరకు జిల్లాలోని 2,25,485 మంది రైతుల ఖాతాలలో రూ.134.43 కోట్ల నిధులు ఇప్పటికే జమ అయ్యాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వివరించారు.

మిగతా రైతులకు కూడా ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా నిధులను వారి వారి ఖాతాలలో జమ చేయనుందని తెలిపారు. పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రైతు భరోసా ఉపయుక్తంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడం పట్ల రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. డెబిట్ డెబిట్ కానీ రైతులు సంబంధించిన మండల వ్యవసాయ అధికారి కార్యాలయంకు వెళ్ళి సంప్రదించగలరు. జూన్ 5 లోపు కొత్తగా పట్టా పుస్తకం వచ్చిన వారు వారి పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం తీసుకొని సంబంధిత వ్యవసాయ అధికారి కార్యాలయంకు వెళ్ళి జూన్ 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

# రైతుల ఖాతాల్లో రూ. 250 కోట్ల 67 లక్షల రైతు భరోసా నిధులు జమ...

- **జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

రైతుల ఖాతాల్లో 250 కోట్ల 67 లక్షల రైతు భరోసా నిధులు జమ చేసామని జిల్లా వ్యవసాయ అధికారి జి. పుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3 లక్షల 53 వేల 794 మంది రైతుల ఖాతాల్లో మొత్తం 436 కోట్ల 84 లక్షల 65 వేల 365 రూపాయలు జమ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 2 లక్షల 88 వేల 151 మంది రైతులకు 250 కోట్ల 67 లక్షల 89 వేల 542 రూపాయలను రైతు భరోసా వానాకాలం2025 క్రింద రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు.



# అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

- **360 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం.**
- **పలువురి పై కేసు నమోదు.**
- **ఎస్సై శంకర్**

**మెదక్ బ్యూరో /అల్లాదుర్గం తెలంగాణ ముచ్చట్లు,**

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకుని అందులో ఉన్న 360 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. మంగళవారం 161 జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా సంగారెడ్డి వైపు నుండి నాందేడ్ వెళ్తున్న లారీని తనిఖీ చేయగా పిడిఎఫ్ రైస్ ఉందన్న అనుమానంతో సివిల్ సప్లై వారికి తెలియజేయడం జరిగిందన్నారు. డి సి ఎస్ ఓ జూనియర్ అసిస్టెంట్ నాగరాజు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ చందన్ బై, లారీ ఓనర్ ఎండి షౌకత్, బియ్యం యజమాని రాజు రాథోడ్, తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, 360 క్వింటాళ్ల బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించడం జరిగిందని ఎస్ఐ శంకర్ వివరించారు.




# "బనకచర్ల"పై ప్రత్యేక సమావేశానికి హాజరైన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఏపీ చేపడుతున్న గోదావరి బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును తీవ్రంగా ప్రతిఘటించాలనే ఉద్దేశంతో.. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరయ్యారు. గోదావరి ట్రిబ్యునల్ తీర్పుతోపాటు రాష్ట్ర పునర్విభజన చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ.. అధికార, విపక్ష ఎంపీలతో కలిసి చర్చించారు.



# డిప్యూటీ సీఎం ను మర్యాద పూర్వకంగా కలిసిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరికి డిప్యూటీ సీఎం శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రిగా నియామకమైన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ని కలిశానని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం పర్యటనలో ఉన్నారని తెలుసుకొని హైదరాబాద్ నుంచి వచ్చి మర్యాద పూర్వకంగా కలిశానని క్యాంపు కార్యాలయంలో జిల్లా ఇంచార్జి మంత్రి మీడియా ప్రతినిధులకు తెలిపారు. త్వరలో ఖమ్మం జిల్లాకు సంబంధించిన ముగ్గురు మంత్రులతో సంప్రదించి ఒక తేదీ ఖరారు చేసుకుని, జిల్లా సమీక్షా సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. అంతకుముందు ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు వాకిటి శ్రీహరిని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లు మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.





# జగమెరిగిన మిమిక్రీ కళాకారుడు



భారత దేశంలో మిమిక్రీ కళకు ఆయన ఆద్యుడు. ఎంతో మంది ప్రముఖుల వందలాదిగా గొంతులను సునాయాసంగా, యథాతథంగా అనుకరించేవారు. భారత్‌లో అనుకరించి, నవ్వించే కళగా మాత్రమే ఉన్న మిమిక్రీని ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడు. రాష్ట్రపతులు, ప్రధానుల నుండి సామాన్యుల వరకూ దేశంలో ఆయన అపూర్వ, అపురూప కళను అభినందించని వారుండ రంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు గుర్తు పట్టారనుకుంటా. ఆయనే వందలాది గొంతుకల వేణు మాధవుడు. ధ్వన్యనుకరణ సామ్రాట్ అనే బిరుదును పొందిన, తెలంగాణ గర్వించ దగ్గ ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ళ వేణుమాధవ్ ( డిసెంబరు 28, 1932 జూన్ 19, 2018 ) చిన్నప్పుడు ఉర్దూ మాధ్యమంలో చదువుకున్నారు. అయినా ఆయన అమెరికా, బ్రిటన్ ఇంగ్లిష్ ఉచ్చారణలతో కూడా గొప్ప ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన సొంతంగా ఈ కళను సాధన చేశారు. స్వీయ పరిశీలన, స్వయం అధ్యయనంతో తనను తాను మెరుగు పరచు కుంటూ అత్యున్నత స్థాయిని అందుకున్న ప్రతిభాశాలి. చిన్నతనంలో చిలకమర్తి లక్ష్మీ నరసింహం రాసిన ప్రహసనాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నా అప్పటి ప్రముఖ నటులు చిత్తూరు నాగయ్య, వేమూరు గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య తదితరుల సినిమాల ప్రభావంతో మిమిక్రీ కళపై మొగ్గు చూపారు. 1947 నుంచి ఈయన మిమిక్రీ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు. తెలుగు లోనే కాక ఇతర భాషల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చారు. ఐక్యరాజ్య సమితిలో కూడా ప్రదర్శన ఇచ్చారు. 1953 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారాన్నిచ్చి గౌరవించింది..కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ, జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత సినారె మొదలైన ప్రముఖులు తమ రచనలను ఆయనకు అంకిత మివ్వడం ఆయన గొప్ప తనాన్ని స్పష్టం చేస్తుంది. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ, జె. ఎన్. టి. యు, కాకతీయ విశ్వ విద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. తిరుపతిలో ఆయనకు గజారోహణం, పౌర సన్మానం జరిగాయి. ఆయన స్వయంగా నేరెళ్ళ వేణుమాధవ్ సాంస్కృతిక సంస్థను స్థాపించి ప్రతి యేటా ఒక కళాకారుడిని సన్మానించారు. హనుమ కొండలో ఆయన పేరు మీదుగా డా. నేరెళ్ళ వేణుమాధవ్ కళా ప్రాంగణం నిర్మించారు. నేరెళ్ళ వేణుమాధవ్ వరంగల్ పట్టణం లోని మట్టెవాడలో శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932 డిసెంబరు 28న జన్మించారు. పండితుడైన తండ్రి, వరంగల్ పట్టణానికి వచ్చే ప్రముఖులందరికీ తన ఇంట్లోనే ఆతిథ్యం ఇస్తుండగా, అలా వచ్చిన వారిలో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, వావిలికొలను సుబ్బారావు, వడ్డాది సుబ్బా రాయుడు, రాయప్రోలు సుబ్బారావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాశీ కృష్ణాచార్యులు, యర్రమిల్లి జగ్గన్న శాస్త్రి వంటి గొప్పవారి సాహితీ గోష్ఠుల ప్రభావం వేణుమాధవ్ మీద పడిరది. సినిమాలంటే ఎంతో ఇష్టం. చిత్తూరు నాగయ్య నటించిన గృహలక్ష్మి, వందేమాతరం, దేవత, స్వర్గసీమ, పోతన, వేమన సినిమాలు చూసి, నాగయ్య కూడా ధ్వన్యనుకరణ చేయగలవారు కావడంతో ఆయన పై అభిమానంతో కేవలం స్వయం పరిశీలనతోనే ఆ రంగంలో ప్రవేశించారు. అలాగే వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య నటించిన సినిమాలు చూసి, ఇంటికి రాగానే ఆ సినిమాల్లోని పాటలను, పద్యాలను యథాతథంగా అనుకరించి చూపేవారు. అలా మొదలయ్యింది అయన మిమిక్రీ ప్రస్థానం. 1950 లో మెట్రిక్యులేషన్, 1952 లో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చేరారు. నాటి ప్రిన్సిపాల్ బారు వెంకట రామనర్సు, ఇతర లెక్చరర్లు వారించినా వినకుండా, గుడ్ కాండక్టు కింద వేణుమాధవ్ కు ఆ రోజుల్లో అరవై రూపాయల స్కాలర్‌షిప్ ( బర్సరీ ) మంజూరు చేశారు. ఆ డబ్బుతో పలు ఇంగ్లీషు సినిమాల్ని చూసి వాటిల్లోని ఆర్టిస్టుల గొంతులు, ముఖ్యమైన సన్నివేశాలు బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నోట్స్ తో సహా వినిపిస్తే, రామనర్సు పరమానంద భరితులై ''యూ విల్ బికం ఎ గ్రేట్ ఆర్టిస్ట్ ఇన్ ద వరల్డ్'' అని, అయితే నీవు నా రెండవ కుమారుడవు అని మనసారా ఆశీర్వదించారు. ఆ దీవెనలే ఆయనను 'విశ్వ విఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్' గా ఎదిగేలా చేసాయి. 1953 లో ప్రభుత్వ పాఠశాల (జి సి ఎస్ స్కూలు హనుమకొండ) లో ఉపాధ్యాయులుగా ప్రవేశించి, ధర్మ సాగరం, హనుమకొండ లోని ప్రాక్టీసింగ్ స్కూలు, మట్వాడ ఉన్నత పాఠశాల, జనగామ, శంభునిపేట పాఠశాలల్లో పని చేశారు. అనంతర కాలంలో ప్రైవేటుగా బీ.ఏ. బీ. కాం పాసయ్యారు. తొలి ప్రదర్శన 1947 లో ఇచ్చారు. మలి ప్రదర్శన 1953 లో రాజమండ్రిలో జరిగిన థియేటర్స్ ఫెడరేషన్ కాన్ఫరెన్స్ లో బలరాజ సహానీ అధ్యక్షతన, గరికపాటి రాజారావు, దాడి గోవింద రాజులు, స్థానం నరసింహారావు, చాగంటి సన్యాసి రాజు తదితర ప్రముఖుల సమక్షంలో ఇచ్చారు. ఆయన ప్రదర్శనలు చూసిన పలువురు రాజకీయ ప్రముఖుల్లో దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, దివంగత ప్రధానులు ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు లాంటి ఎంతోమంది ఉన్నారు. ఆస్ట్రేలియా, ఫిజీ దీవులు 1965, సింగపూర్, మలేషియా 1968, పశ్చిమ జర్మనీ, ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా, కెనెడా, లెబనాన్ 1971, ఐక్యరాజ్య సమితిలో ప్రదర్శన 1971, సింగపూర్,మలేషియా 1975, అమెరికా, కెనెడా 1976, దక్షిణాఫ్రికా, మారిషస్, సీషెల్స్ 1976, సింగపూర్, మలేషియా 1977, అమెరికా, కెనెడా 1982, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 1987, మారిషస్ 1990 తదితర దేశాలలో పర్యటించి ప్రదర్శనలు ఇచ్చారు. వేణుమాధవ్ గారు నిర్వహించిన పదవుల్లో ఎం.ఎల్.సీ (197278), ఎఫ్.డీ.సీ డైరెక్టర్ (197677), సంగీత నాటక అకాడమీ సభ్యుడు (197478), సౌత్ జోన్ కల్చరల్ కమిటీ, తంజావూరు సభ్యుడు, దూరదర్శన్ ప్రోగ్రాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు (199394), టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు (199396), రైల్వే జోనల్ యూజర్స్ కమిటీ సభ్యుడు (199396), ఎ.పి.లెజిస్లేటివ్ లైబ్రరీ కమిటీ సభ్యుడు (197275), రవీంద్ర భారతి కమిటీ సభ్యుడు (1974 78), ప్రభుత్వ అకాడమిక్ రివ్యూ కమిటీ సభ్యుడు (197576) తదితర పదవులు నిర్వహించారు. ధ్వన్యనుకరణ సామ్రాట్, మిమిక్రీ సామ్రాట్, చుపే రుస్తుం ధ్వన్యను కరణ చక్రవర్తి, కళా సరస్వతి, స్వర్ కే రాజా, ధ్వన్యను కరణ ప్రవీణ, ధ్వన్యను కరణ కళానిధి, మిమిక్రీ రత్న, విశ్వ విఖ్యాత ధ్వన్యను కరణ సార్వభౌమ, మున్నగు బిరుదులు వరించాయి. 1977 ఆంధ్రా విశ్వ విద్యాలయం నుండి కళా ప్రపూర్ణ బిరుదు, 1982 రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, 1987 జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వ విద్యాలయం, 1992 కాకతీయ విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు...1997 కనకాభిషేకం, 1998 ఎన్టీఆర్ ఆత్మ గౌరవ పురస్కారం, 2001 పద్మశ్రీ, 2005 తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారాలు 2018లో భాగంగా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పురస్కారం అందజేయ బడిరది. తిరుపతి పట్టణంలో గజారోహణం, పౌర సన్మానం జరిగాయి. పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 2018, జూన్ 19వ తేదీ తమ 85వ యేట కన్నుమూశారు. హనుమకొండ పట్టణంలో నిర్మింపబడ్డ 'డా.నేరెళ్ళ వేణుమాధవ్ గారి కళాప్రాంగణం ' సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు చక్కని వేదికగా ఉపయోగ పడుతున్నది. నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్ట్' ను స్థాపించి ప్రతియేటా తన పుట్టిన రోజైన డిసెంబర్ 28న ప్రముఖ కళాకారులను పదివేల రూపాయల పురస్కారంతో సత్కరిస్తున్నారు. 2017లో నేరెళ్ల వేణుమాధవ్ పేరుతో పోస్టల్ శాఖ ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది. ఆయన పుట్టిన రోజైన డిసెంబర్ 28వ తేదీని తెలుగు రాష్ట్రాల్లో 'మిమిక్రీ డే'గా జరుపు కుంటారు.






# నరమేధంపై గ్రేటా తెగువ

హిట్లర్, ముస్సోలినీలను మించి నరమేధం సాగిస్తున్న నెతన్యాహు సర్కారుపై, దానికి సమస్త వనరులను కట్టబెడుతున్న అమెరికా తీరుపై ప్రపంచ వ్యాప్తంగా యువతలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. పసిబిడ్డలు, మహిళలనుసైతం శత్రువులుగా చూస్తూ సహాయ కేంద్రాల వద్దకు ఆహారం కోసం వచ్చిన వారిని సైతం చంపుతున్న ఇజ్రాయిల్ దుర్మార్గం యువతను కదిలించివేస్తోంది. ప్రముఖ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్, పాలస్తీనా సంతతికి చెందిన యూరోపియన్ పార్లమెంట్ లో ఫ్రెంచి సభ్యురాలు రిమా హసన్‌తోపాటు పన్నెండు మంది యువ కార్యకర్తల బఅందం ఈ నెల ఒకటిన సిసిలీ నుంచి బ్రిటీష్ నౌక మాడ్‌లీన్‌లో గాజాకు బయల్దేరింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆ స్థాయికి మించి 55 వేలమందికిపైగా అమాయ కులను, అందులోనూ అత్యధికంగా మహిళలు, చిన్నారులను ఇజ్రాయిల్ పొట్టన పెట్టుకుంది. ఆసుపత్రులు, పాఠశాలలు, శరణార్థి కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ నాశనం చేసింది. ఇరవై లక్షలకుపైగా నివాసాలను భస్మీపటలం చేయడంతోపాటు దేరాల కింద తలదాచుకుంటున్న వారిని మాటిమాటికీ ఖాళీ చేయిస్తోంది. గాజాలోకి ఆహారం, ఇతర నిత్యావసరాలు తీసుకొచ్చే మానవతా సాయాన్ని సైతం అడ్డుకుంటోంది. పాలస్తీనా జాతి నిర్మూలన చేయాలన్న లక్ష్యంతో మానవతా విపత్తులోకి నెట్టిన ఇజ్రాయిల్ దుర్మార్గం మత, జాతి ఉన్మాదులకు మానవత్వం ఉండదనడానికి మరో రుజువు. ఈ ఘాతుకాలన్నీ అంతర్జాతీయంగా చర్చనీయాంశం చేయాలని, ఇజ్రాయిల్ సముద్ర దిగ్బంధనాన్ని ఛేదించి పిల్లల కోసం పాలు, ఆహార పదార్థాలు, అత్యవసర వైద్య పరికరాలు, ఇతర జీవనావసరాలను అందజేసేందుకు ఫ్రీడమ్ ఫ్లోటిల్లా ఆధ్వర్యాన బ్రిటీష్ నౌక మాడ్‌లీన్ బయల్దేరింది. గాజాకు 200 కిలోమీటర్ల దూరంలో అంతర్జాతీయ జలాల్లోనే ఈ నౌకను ఇజ్రాయిల్ నిర్బంధించడం, సహాయం అందకుండా చేయడం అమానుషం. నిర్బంధంలోకి తీసుకున్న గ్రెటా థన్‌బెర్గ్‌తో సహా నలుగురిని స్వదేశాలకు పంపివేసింది. ఇజ్రాయిల్ నిర్బంధంలోనే ఉన్న మిగిలిన వారు స్వదేశాలకు వెళ్లడానికి నిరాకరించి, ఆందోళన చేస్తున్నారు. తనను, తన సహచరులను అంతర్జాతీయ జలాల్లో కిడ్నాప్ చేశారన్న గ్రెటా ఇజ్రాయిల్ అధికారులు తమ పట్ల వ్యవహరించిన అమానవీయమైన తీరు పాలస్తీనియన్ల వేదనతో పోలిస్తే లెక్కలోకి రాదన్నారు. దిగ్బంధనాన్ని ఛేదించడం దేశాల చట్టపరమైన బాధ్యత, మనందరి నైతిక బాధ్యత అన్న ఐక్యరాజ్య సమితి ప్రత్యేక దూత ఫ్రాన్సెసా అల్బనీస్ మాటలను లెక్కచేయని ఇజ్రాయిల్, అమెరికాల తీరు దుర్మార్గం. ఈ ప్రతిఘటన ద్వారా ఇజ్రాయిల్ నరమేధాన్ని మరోసారి అంతర్జాతీయ సమాజం ముందుంచిన గ్రెటా థన్‌బర్గ్ బృందం కృషి అభినందనీయం. ఇంతటి రాక్షసకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు నేటికీ అమెరికా వంత పాడుతూనే ఉంది. గ్రెటాకు కాస్త కోపం ఎక్కువనుకుంటా, ముందుగా ఆమె కోపాన్ని తగ్గించుకునే క్లాసులకు వెళ్లాలంటూ ట్రంప్ ఉచిత సలహా ఇచ్చారు. 'ఎముకలు క్రుళ్లిన, వయస్సు మళ్లిన సోమరులారా చావండి! నెత్తురుమండే శక్తులు నిండే సైనికులారా రారండి' అన్న శ్రీశ్రీ 'మరో ప్రపంచం' పిలుపు యువతకు అభ్యుదయ మార్గానికి దిశానిర్దేశం చేస్తూనే ఉంటుంది. అందువల్ల అటువంటి చచ్చు సలహాలు ఉద్యమకారుల స్ఫూర్తిని ఏమాత్రం ప్రభావితం చేయవు. ఇజ్రాయిల్ దుర్మార్గాలపై ఇటీవల అమెరికా గడ్డ మీద గర్జించిన యువ విజ్ఞాన వేత్త మేఘా వేమూరిని గుర్తు చేసుకోవడం అవసరం. 'మేము గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని మా జీవితంలో ముందుకు సాగడానికి సిద్ధమవుతుంటే, గాజాలో విశ్వవిద్యాలయాలే లేకుండా పోయాయి' అంటూ తన భవిష్యత్‌ను సైతం పణంగా పెట్టి ప్రశ్నించిన ఆమె తీరు యువతకు స్ఫూర్తిదాయకం. పాలస్తీనాకు అనుకూలంగా మాట్లాడటమే నేరమన్నట్టు ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ సహా పలు యూనివర్సిటీలకు నిధులను నిలిపివేస్తున్న, విద్యార్థులను విచక్షణా రహితంగా అరెస్టులు చేస్తూ, బేడీలు వేసి పంపిస్తున్న మితవాద ట్రంప్ పాలనలో భారత సంతతికి చెందిన మేఘా చూపినపాటి తెగువ చూపలేని మోడీ సర్కారు తీరు సిగ్గుచేటు. మనదేశంలో పెరుగుతున్న ఉన్మాదాన్ని ఆదిలోనే అడ్డుకోవడం ఎంత అత్యవసరమో ఇజ్రాయిల్ పరిణామాలు హెచ్చ రిస్తున్నాయి. దురాక్రమణదారైన ఇజ్రాయిల్ పట్ల సందిగ్ధ, బుజ్జగింపు ధోరణిని ఇప్పటికైనా కేంద్రం విడనాడాలి. అమాయకుల ఊచకోతను, యుద్ధ నేరాలను ఖండిరచాలి. సైనిక, భద్రతా సహకారాన్ని నిలిపివేయాలి. శతాబ్దానికిపైగా పాలస్తీనాకు అండగా నిలిచిన మనదేశ చారిత్రక వైఖరిని కొనసాగించాలి. కేంద్రంపై ఒత్తిడిని పెంచేందుకు సంఘీభావం కోసం ఇచ్చిన వామపక్షాల పిలుపునకు సమస్త ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు, పార్టీలు, శాంతికాముకులు మద్దతుగా నిలవాలి.

## జైనాథ్ - శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం - అదిలాబాద్



అదిలాబాద్ జిల్లా పచ్చని చెట్లు, వాగులూ , వంకలూ, జలపాతాలతో పాటు ప్రాచీన ఆలయాలకు ప్రసిద్ధి. వాటిల్లో చూడదగ్గ ఒక దివ్య క్షేత్రం జిల్లాలోని జైనాథ్ లో ఉంది. అష్ట కోలాకార మండపముతో అద్భుతమైన శిల్పకళా సంపదతో కనువిందు చేస్తున్న ఈ దేవాలయానికి వందేళ్ళ చరిత్ర ఉంది. విశాలమైన ప్రాంగణంలో ప్రత్యేకమైన నల్లరాతితో నిర్మించిన ఈ ఆలయం జైన సంప్రదాయ పద్ధతిలో ఉండడం వల్లే ఈ ప్రాంతానికి జైనాథ్ అనే పేరు వచ్చిందని చెబుతారు.

అదిలాబాద్ కు 21 కిమీ దూరంలో జైనాథ్ ఆలయం అతి పురాతనమైనది. ఈ ప్రాంతాన్ని పూర్వం పల్లవ రాజులు పరిపాలించారని చరిత్ర ఉంది. ఇక్కడ ఉన్న శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయం జైన వాస్తును పోలి ఉంటుంది. ఈ ఆలయము కాక మిగతా ఆలయాలు కూడా జైనా వాస్తు శైలి కనిపించడం వలన ఈ ప్రాంతానికి జైనాథ్ గా వ్యవహరించబడుతోంది. శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దర్శనార్థం భక్తులు పలు ప్రాంతాల నుండి వస్తూ ఉంటారు.


దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కోసం దశావతారాలు ఎత్తిన నారాయణుడు ఈ క్షేత్రంలో లక్ష్మీ సమేతడిగా దర్శనమిస్తున్నాడు. కోరిన కోర్కెలు తీరుస్తూ భక్త సులభుడిగా పేరుపొందాడు.

జైనాథ్ ఆలయం, శ్రీ నారాయణ స్వామి ఆలయం అని కూడా పిలుస్తారు. ప్రసిద్ధ జైన దేవాలయం. ఈ జైనాథ్ ఆలయం గర్భగుడిలో నల్లని రాతితో చెక్కబడిన నారాయణస్వామి విగ్రహం ఉంది.

**ఆలయ చరిత్ర :**

జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో ఉంది. ప్రకృతి సిద్ధంగా లభించే నల్ల రాతితో నిర్మితమైన అతి పురాతనమైన ప్రాచీన ఆలయం. జైన బతుడు ప్రార్ధన చేసుకోవడానికి ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తర్వాత పల్లవ రాజుల కాలంలో స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు చారిత్రక ఐతిహ్యం.

ఆలయం గోడల పైన చెక్కిన దాదాపు 20 శ్లోకాలు బట్టి ఈ ప్రాంతం సా. శ. 4 నుండి 9 వ శతాబ్దం నాటి వరకు పల్లవ సామ్రాజ్యంలో ఉన్నదని, ఈ ఆలయం కట్టబడిందని ప్రాకృత రాతిశాసన ద్వారా తెలుస్తోంది. దాదాపు



500 ఏళ్ల పాటు దక్షిణ భారతదేశంలో పాలించిన పల్లవుల కళా నైపుణ్యం గొప్పదే కాకుండా హస్తకళలో శిల్పకళలోనూ వారు సిద్ధహస్తులు. ఈ ఆలయం జైన్ సాంప్రదాయంతో ఉండడం వల్ల ఊరికి జైనాథ్ అనే పేరు వచ్చిందని కూడా చెబుతారు. ఆలయం యొక్క చారిత్రక ప్రాముఖ్యత రాళ్లపై ఉన్న వివిధ శ్లోకాలు మరియు శాసనాల నుండి అంచనా వేయబడింది. నాగర శైలిలో నిర్మితమైన ఈ ఆలయం దేవతల ఆవాసస్థలిగా విరాజుల్లుతోంది. శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి నివాసం ఉన్న దేవాలయం జైన ఆలయ నిర్మాణ శైలిని పోలి లక్షణాలను కలిగి ఉన్న ప్రసిద్ధ దేవాలయ కారణంగా ఈ గ్రామానికి జైనాథ్ అనే పేరు వచ్చింది. వాస్తు రీత్యా ఇది రెండు అడుగుల ఎత్తులో ఉన్న వేదికపై ఉన్న చిన్న దేవాలయం. గర్భగుడిలోని స్వామి వారి విగ్రహం ఆరడుగుల ఎత్తు పూర్తిగా నల్లరాతితో నిర్మించబడింది. ప్రతి ఏడు అశ్వయుజ పౌర్ణమి నాడు ఉదయ కిరణాలు శ్రీ లక్ష్మీ నారాయణస్వామి పాదాలు తాకుతాయని స్థానికులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా భక్తులను ఆకర్షిస్తాయి. పల్లవ రాజులు ఈ గ్రామానికి రాచరికం అందించారని నమ్ముతారు.

అదిలాబాద్ జిల్లా మరియు ఉత్తర తెలంగాణలోని ఇతర దర్శనీయ ప్రదేశాలతో అనుసంధానించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలతో ఆలయం పరిసరాలు పూర్తి చేస్తున్నారు.

హైదరాబాదు నుండి ఆరు గంటల రోడ్డు ప్రయాణం పడుతుంది. ఇక్కడి నుండి జాయిన్ ఆలయానికి చేరుకోవడానికి మరో 21 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మరో 30 నిమిషాల ప్రయాణం పడుతుంది.

**కావ్యసుధ**
**వాఙ్మయ భూషణ**
**సాహితీ శిరోమణి**
**ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్**
**ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్**
**9247313488 :**
**హయత్ నగర్ : హైదరాబాదు**

## అనువంశిక రక్తరుగ్మత 'సికిల్ సెల్ అనీమియా'

తల్లితండ్రుల నుంచి సంక్రమించే జన్యులోప రుగ్మతగా "సికిల్ సెల్ రక్తహీనత" ప్రమాదకరంగా మారుతోంది. శరీర కణజాలానికి ప్రాణవాయువు, ఆక్సీజన్‌ను అందించే రక్తంలోని ఎర్ర రక్త కణాలతో కూడిన హీమోగ్లోబిన్ ఉపకరిస్తుంది. ఆక్సీజన్‌ను సరఫరా చేస్తున్న ఎర్ర రక్త కణాలు గుండ్రంగా, మృదువుగా, ఫ్లెగ్జిబుల్‌గా ఉంటూ రక్త నాళాల గుండా సులభంగా ప్రవహిస్తూ, మన ఆరోగ్యానికి పునాదులు వేస్తున్నాయి. సికిల్ సెల్ రుగ్మత బారిన పడిన వ్యక్తుల ఎర్ర రక్త కణాలు దృఢంగా, గట్టిగా, అంటుకునే గుణంతో, సి-ఆకారంలో కొడవలి లేదా సికిల్ ఆకారంలో ఉంటాయి. ఆ సికిల్ కణాలు రక్తనాళాల్లో సులభంగా ప్రవహించకుండా, త్వరగా చనిపోతూ ఉంటాయి. ఇలాంటి సికిల్ సెల్ రుగ్మత ఉన్న వారిలో దీర్ఘకాలిక రక్తహీనత, నొప్పులు, అవయవాలకు హాని, ఇతర తీవ్రమైన అనారోగ్యాలను కలిగిస్తుంది. దీనినే సికిల్ సెల్ రుగ్మతగా పిలవడం జరుగుతోంది. సికిల్ సెల్ రక్త రుగ్మత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, ముందస్తు పరీక్షలతో గుర్తించడం, వ్యాధిగ్రస్తుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం, రోగుల కుటుంబాల్లో ఆత్మ విశ్వాసం పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ఐరాస ఆమోదంతో ప్రతి ఏట 19 జూన్ రోజున "ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం (వరల్డ్ సికిల్ సెల్ అవేర్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం ఇతివృత్తంగా "స్వీయ అనుకూల వాదంతో పౌర సమాజాన్ని శక్తివంతం చేయడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. భా రత గిరిజన తెగల్లో అత్యధికంగా కనిపిస్తున్న సికిల్ సెల్ వ్యాధి ప్రమాదకరంగా మారుతోంది. 2011 వివరాల ప్రకారం 8.6 శాతం గిరిజన జనాభా లేదా 67.8 మిలియన్ల అభాగ్యులు సికిల్ సెల్ రుగ్మత బారిన పడ్డట్లు స్పష్టం అవుతున్నది. భారతదేశంలో యంపీ, ఛత్తీస్‌ఘడ్, రఖార?ండ్, ఒడిసా, గుజరాత్, మహారాష్ట్ర లాంటి 17 రాష్ట్రాలు/యూటీల్లో అధికంగా కనిపిస్తున్న సికిల్ సెల్ వ్యాధిగ్రస్థులు కనిపిస్తున్నారు. వ్యాధి తీవ్రతను గుర్తించిన భారత ప్రభుత్వం "జాతీయ సికిల్ సెల్ రక్తహీనత నిర్మూలన మిషన్"ను తీసుకోని 2047 నాటికి ఈ వ్యాధిని నిర్మూలించడానికి పథక రచన చేసి అమలు పరుస్తున్నారు. ఈ మిషన్‌లో భాగంగా 2026 నాటికి 7 కోట్ల గిరిజనులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి కృషి జరుగుతోంది. జన్యువుల్లో మ్యుటేషన్ లేదా ఒకదానితో మరొకటి మార్పు చెందడం వల్ల హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో లోపం జరుగుతుంది. తల్లితండ్రులు ఇద్దరిలో ఇలాంటి జన్యు లోపాలు ఉన్నట్లు అయితే వారి సంతానానికి కూడా సికిల్ సెల్ రుగ్మత సంక్రమిస్తుంది.తల్లితండ్రుల్లో ఒక్కరికి మాత్రమే జన్యు లోపం ఉన్నట్లైతే పిల్లల్లో జన్యు లోపాలు కనిపించినప్పటికీ రోగ లక్షణాలు మాత్రం కనిపించకపోవచ్చని తెలుసుకోవాలి. సికిల్ సెల్ వ్యాధులు (హీమోగ్లోబిన్-ఎస్ఎస్, ఎస్ఐ, ఎస్ బీటా-తలసేమియా లాంటివి) పలు రకాలుగా ఉంటాయని, వీటిని త్వరగా గుర్తించడం వల్ల వ్యక్తుల జీవితాల్లో ఆరోగ్యాలను పెంచవచ్చని, ఆరోగ్య సురక్ష గొడుగు పట్టవచ్చని తెలుసుకోవాలి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## భారత్-కెనడా మధ్య తిరిగి దౌత్య బంధం

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)

నిజ్జర్ హత్యతో దెబ్బతిన్న భారత్‌కెనడా మధ్య సంబంధాలు మళ్లీ బలపడుతున్నాయి. గత రెండేళ్లుగా ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇటీవలే జరిగిన కెనడా ఎన్నికల్లో అధికార మార్పు జరగడం.. తాజాగా ప్రధాని మోదీ కెనడా పర్యటనతో మొత్తం మారిపోయింది. ట్రూడో పాలనలో తెగిపోయిన సంబంధాలు ఇప్పుడు మళ్లీ బలపడుతున్నాయి.రెండు దేశాల మధ్య పూర్తి దౌత్య సేవలను తిరిగి ఇరు దేశాలూ తాజాగా అంగీకారానికి వచ్చాయి. కెనడాలో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సుకు హాజరయ్యేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ తో మోదీ సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతానికి సంబంధించిన కీలక అంశాలపై ఇరువురూ చర్చించారు. ఈ సందర్భంగా దౌత్యవేతలను తిరిగి నియమించడంపై ఏకాభిప్రాయం కుదిరింది. ఇరుదేశాల పౌరులు, వ్యాపారాలకు సాధారణ సేవలను పునరుద్ధరించే లక్ష్యంతో కొత్త హై కమిషనర్లను నియమించడానికి అంగీకరించినట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ తెలిపారు. ఈ సమావేశం ముఖ్యమైనదని భావిస్తున్నానని అన్నారు.

## అమెరికా జోక్యం చేస్తే విస్తృత యుద్ధమే: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హెచ్చరిక

టెహ్రాన్:



ఇజ్రాయెల్‌ఇరాన్ యుద్ధంలో బుధవారం కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇజ్రాయెల్‌కు అండగా అగ్రరాజ్యం అమెరికా యుద్ధరంగంలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి. యుద్ధానికైనా, శాంతికైనా అమెరికా సైన్యం సిద్ధంగా ఉందని ఆ దేశ రక్షణ మంత్రి పీట్ హేగ్సెత్ పేర్కొన్నారు. అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల కోసం తాము ఎదురుచూస్తున్నామని చెప్పారు. ‘‘ఎప్పుడు ఆదేశాలు వస్తే అప్పుడు వాటిని అమలు చేస్తాం’’ అని ఆయన సెనెట్ కమిటీకి తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకుంటుందా లేదా అన్న ప్రశ్నకు తాను జవాబు చెప్పలేనని అన్నారు. ‘‘జోక్యం చేసుకోవచ్చు. చేసుకోకపోవచ్చు. నేనేం చేయాలనుకుంటున్నానో ఎవరికీ తెలియదు. ఇరాన్ మాత్రం పెద్ద ప్రమాదంలో ఉందని మాత్రం చెప్పగలను. వారు ఇప్పుడు చర్చించాలని అనుకుంటున్నారు. కానీ ఇప్పటికే ఆలస్యమైంది. రెండు వారాల క్రితమే వారు చర్చించి ఉండాల్సింది’’ అని శ్వేతసౌధంలో జరిగిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అంతకుముందు అమెరికా తీరుపై ఇరాన్ సుప్రీంనేత అయతుల్లా అలీ ఖమేనీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యుద్ధంలో జోక్యం చేసుకుంటే అగ్రరాజ్యాన్ని కోలుకోలేని దెబ్బతీస్తామని హెచ్చరించారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలంటూ మంగళవారం ట్రంప్ చేసిన సూచనపైనా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇజ్రాయెల్‌కు తాము లొంగిపోయే ప్రసక్తే లేదన్నారు. ‘‘ఇరాన్ గురించి తెలిసిన వారెవరూ ఇలా బెదిరించే భాషను ఉపయోగించరు. ఎందుకంటే ఇరాన్ లొంగిపోయే దేశం కాదని వారికి తెలుసు’’ అని ముందే రికార్డు చేసిన ఓ వీడియో సందేశంలో ఖమేనీ పేర్కొన్నారు.

**‘సెంట్రిఫ్యూజ్’ కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడులు**

ఇరాన్ అణుకేంద్రాలు లక్ష్యంగా బుధవారం ఇజ్రాయెల్ తన దాడులను తీవ్రతరం చేసింది. టెహ్రాన్‌కు సమీపంలో యురేనియం సెంట్రిఫ్యూజ్‌లు తయారు చేసే కేంద్రాలను ధ్వంసం చేసింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ అణు శక్తి సంస్థ కూడా ధ్రువీకరించింది. మొత్తం ఇప్పటివరకు తమ వాయుసేన ఇరాన్‌లో 1,100 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) అధికార ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డెఫ్రిన్ పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇరాన్‌లో 239 మంది చనిపోయారని, ఇందులో 126 మంది భద్రతా సిబ్బంది ఉన్నారని వాషింగ్టన్‌కు చెందిన ‘హ్యూమన్‌రైట్స్ యాక్టివిస్ట్స్’ సంస్థ తెలిపింది.

## త్వరలో ఇంటెల్‌లో భారీగా కార్మికుల తొలగింపు

ప్రముఖ టెక్ దిగ్గజం ఇంటెల్ భారీగా ఉద్యోగులు, కార్మికులను ఇంటికి పంపించే పనిలో ఉంది. ఇప్పటికే వేలాది మందిని తొలగించిన ఈ సంస్థ వచ్చే జులైలో మరింత మందిపై వేటు వేయడానికి సిద్ధం అవుతోంది. తదుపరి తొలగింపుల్లో ఫ్యాక్టరీలో పని చేసే 1520 శాతం మంది ఉద్యోగులపై ప్రభావం ఉండొచ్చని రిపోర్టులు వస్తోన్నాయి. ఇంటెల్ నూతన సిఇఒగా లిప్ బు టాన్ మార్చిలో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయన పొదుపు చర్యలకు ప్రణాళికలు రూపొందించారు. కంపెనీ విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం ఇంటెల్‌లో కొత్త విడత తొలగింపులు జులై మధ్యలో ప్రారంభమై నెలాఖరు నాటికి ముగిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నిర్ణయం చాలా బాధాకరమైనదని.. కానీ పరిశ్రమ సవాళ్లను పరిష్కరించడానికి, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఎంతో అవసరమనం ఇంటెల్ చిప్ మ్యానుఫ్యాక్చరింగ్ చీఫ్ నాగ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇంతక్రితం ఇంటెల్ 2024లో 15,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఇందులో ఒరెగాన్‌లో 3,000 మంది సిబ్బంది ఉన్నారు. మరోమారు ఒరెగాన్ ఉద్యోగులపై వేటు పిడుగు పడనుందని అంచనా.

# రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఒక్క ఏడాదిలోనే 21వేల కోట్ల రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది
- పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం
- రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి....*
- డిసిసి బ్యాంక్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్
- బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది
- దేశ చరిత్రలో ఏకకాలంలో 21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే
- కాంగ్రెస్ పాలనలో మహిళా స్వయం సహాయ సంఘాలకు రుణాలు
- డిసిసి బ్యాంకు నూతన బ్రాంచ్, గోదాంను ప్రారంభించిన ఎంపీ,ఎమ్మెల్యే



ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:

రైతు సంక్షేమమే ధ్యేయంగా ఒక్క ఆర్థిక సంవతంలోనే వ్యవసాయ రంగానికి 30వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.


బుధవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 2వేల మెట్రిక్ టన్నుల గోదాం, డీసిసి బ్యాంక్ ధర్మసాగర్ బ్రాంచ్ నూతన భవనం, కామన్ సర్వీస్ సెంటర్, గోదాంలను తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నెని రవీందర్ రావుతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం పాటుపడుతున్న విషయాన్నీ రైతులు గుర్తించాలని కోరారు. ఒక్క ఏడాదిలోనే 25లక్షల మంది రైతులకు 21వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం ఆకలితో ఉండకూడదు అని రేషన్ షాప్ ల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం మాత్రమేనని అన్నారు. సన్నాలు పండించే రైతులను ప్రోత్సహించాలని 500బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా ద్వారా ఇప్పటి వరకు 40లక్షల మంది రైతులకు 4వేల కోట్లు బ్యాంక్ ఖాతాలలో జమ అయ్యాయని రానున్న వారం రోజులలో 90లక్షల మంది రైతులకు 9వేల కోట్లు అందనున్నాయని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ మొతంగా 30వేల కోట్లు కేటాయించిందని వివరించారు. రైతులకు అండగా ఉంటూ రైతు సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది అనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రజలకు అవినీతి రహితమైన పాలన అందించడం, నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే నా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలు సహకరించాలని కోరారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో డీసిసి బ్యాంక్ సేవలను, పీఏసీఎస్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ...**

అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్ గా నిలుస్తుంది అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయాన్ని పండుగ చేయ డానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందులో భాగంగా రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా, పంటల బీమా తదితర పథకాలతోయూ రైతన్నలను ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడులు సాధించారని గుర్తు చేశారు. అంతేకాకుండా బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు

రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ రుణాలన్ని సెంట్రల్ బ్యాంక్ ద్వారా సహకార సంఘాలకు అందజేయడం జరుగుతుందన్నారు. సెంట్రల్ బ్యాంక్ కల్పించే బ్యాంకు సౌకర్యాలను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలని అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రైతులు, మహిళలు డీసీసీ బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలని ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ డీసివో సంజీవ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వరంగల్ డీసిసిబి బ్యాంక్ సిఈవో వజీర్ సుల్తాన్, తహసీల్దార్ సదానందం, ఎంపీడివో అనిల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుమారస్వామి, ఏవో రాకేష్, పాలకవర్గ సభ్యులు, రైతులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## జియో వినియోగదారులకు గుడ్‌న్యూస్..



ఈ ప్రయోజనాలను ఒకే ఆఫర్‌లో అందించడం ద్వారా కొత్త వినియోగదారులకు డిజిటల్ అనుభవాన్ని సులభతరం చేయడం జియో లక్ష్యంగా పెట్టుకుంది. కొత్తగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే వినియోగదారులకు సరికొత్త డిజిటల్ అనుభవాన్ని అందించేందుకు రిలయన్స్ జియో స్టార్టర్ ప్యాక్‌ను ప్రారంభించింది. కేవలం రూ.349తో కస్టమర్లు జియో స్టార్టర్ ప్యాక్‌ను పొందవచ్చు. కొత్త మొబైల్ పరికరాన్ని కొనుగోలు చేసే కస్టమర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ ప్యాక్ డిజిటల్ యుటిలిటీ, అనుభవాన్ని పెంచే లక్ష్యంతో శక్తివంతమైన ప్రయోజనాలను అందిస్తుంది. ఈ ప్రయోజనాలను ఒకే ఆఫర్‌లో అందించడం ద్వారా కొత్త వినియోగదారులకు డిజిటల్ అనుభవాన్ని సులభతరం చేయడం జియో లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆఫర్ కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలుదారులను, బహుళ ప్లాట్‌ఫామ్‌లలో జియో అనుభవాన్ని అన్వేషించాలనుకునే వారికి విస్తృతంగా ప్రయోజనం చేకూర్చనుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న జియో రిటైలర్లు, పార్టనర్ అవుట్‌లెట్‌ల వద్ద ఈ స్టార్టర్ ప్యాక్ అందుబాటులో ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ టెలికాం సర్కిల్ (తెలంగాణ, ఏపీ)లో జియో మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించింది. ఏప్రిల్ 2025కి విడుదలైన ꓛRAI నివేదిక ప్రకారం.. జియో వైర్‌లెస్ మొబిలిటీ, వైర్‌లైన్ బ్రాడ్‌బ్యాండ్, 5G ఫిక్స్‌డ్ వైర్లెస్ యాక్సెస్ విభాగాలలో అద్భుతమైన సబ్‌స్క్రైబర్ వృద్ధిని చూపించింది. అత్యంత పోటీ ఉన్న వైర్లెస్ (మొబైల్) విభాగంలో జియో ఏప్రిల్ 2025లో అత్యధిక నెట్ సబ్‌స్క్రైబర్ జోడిరపుతో టాప్‌లో నిలిచింది. ꓛRAI డేటా ప్రకారం, జియో 95,310 కొత్త సబ్‌స్క్రైబర్లను జోడిరచి, మార్చి 2025లో 3,17,76,074 ఉన్న మొత్తం వినియోగదారులను ఏప్రిల్ 2025లో 3,18,71,384కి పెంచింది. జియో ఫైబర్ లోనూ ఏపీ టెలికాం సర్కిల్‌లో జియో ముందంజలో ఉంది. ఏప్రిల్ 2025లోనే జియో ఫైబర్ 54,000కి పైగా కొత్త సబ్‌స్క్రైబర్లను జోడిరచి, మొత్తం వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ బేస్‌ను సుమారు 1.66 మిలియన్లకు విస్తరించింది. వేగంగా విస్తరిస్తున్న 5G ఫీఔA విభాగంలో జియో ఎయిర్‌ఫైబర్ తెలుగు రాష్ట్రాలలో స్పష్టమైన మార్కెట్ లీడర్‌గా నిలిచింది. ఏప్రిల్ 2025 నాటికి జియో ఎయిర్‌ఫైబర్ దేశవ్యాప్తంగా 6.14 మిలియన్లకి పైగా సబ్‌స్క్రైబర్లను కలిగి ఉంది. ఇందులో పెద్ద భాగం ఏపీ, తెలంగాణ ఉంది. ఏపీ సర్కిల్‌లో జియో ఎయిర్‌ఫైబర్ సబ్‌స్క్రైబర్ బేస్ జనవరి 2025లో 427,439 నుండి ఏప్రిల్‌లో 523,000కి పెరిగి, ప్రాంతంలో 80%కి పైగా మార్కెట్ షేర్‌ను దక్కించుకుంది. ఈ వృద్ధికి జియో వేగవంతమైన 5G ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అమలు, సరసమైన ధరలు, రూరల్, సెమీపట్టణ ప్రాంతాలలో ఫైబర్ కేబుల్స్ వేసే సమస్యలను అధిగమించి హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించే సామర్థ్యం కారణమని చెప్పవచ్చు.



## మార్కెట్లో లాభాల స్వీకరణ


మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగిశాయి. ఒక దశలో 369 పాయింట్లకు పైగా పతనమైన సెన్సెక్స్.. చివరికి 212.85 పాయింట్ల నష్టంతో 81,583.30 వద్ద స్థిరపడిరది. నిఫ్టీ 93.10 పాయింట్లు కోల్పోయి 24,853.40 వద్ద క్లోజైంది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు మళ్లీ కాస్త ఎగబాకడంతో పాటు ఈ వారంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో ట్రేడర్లు ముందు జాగ్రత్త ధోరణితో వ్యవహరించారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లపై త్వరలోనే సుంకాలను ప్రకటించనున్నారన్న వార్తలతో ఔషధ కంపెనీల షేర్లూ ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 నష్టాలు చవిచూడగా.. సన్‌ఫార్మా షేరు 2.18 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎసఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.67 శాతం వరకు నష్టపోయాయి. గత నెలతో ముగిసిన ఏడాది కాలంలో మ్యూచువల్ ఫండ్ పథకాల్లోని తెలంగాణ ఇన్వెస్టర్ల ఆస్తులు 32.08 శాతం పెరిగాయని మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తెలిపింది. ఫండ్ల నిర్వహణలోని వీరి సగటు ఆస్తులు 2024 మే నాటికి రూ.93,601.95 కోట్లుగా ఉండగా.. 2025 మే నాటికి రూ.1,23,633.60 కోట్లకు పెరిగాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) డేటా ఆధారంగా విశ్లేషించి మోతీలాల్ ఓస్వాల్ ఈ డేటాను విడుదల చేసింది. మీడియా చానెళ్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా షేర్లను సిఫారసు చేసే మార్కెట్ నిపుణుడు, ఐఐఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ సంజీవ్ భాసిన్‌తోపాటు 11 మందిని సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టాక్ రికమండేషన్లలో భాగంగా కొన్ని కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచేందుకు సాయపడ్డారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో సెబీ ఈ చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియ ద్వారా అయాచితంగా లబ్ది పొందిన రూ.11.37 కోట్లను తమ వద్ద జమ చేయాలని నియంత్రణ మండలి వారిని ఆదేశించింది.

# ఏకాగ్రతను పెంచడానికి బెస్ట్ యోగా అసనాలు ఇవే!



మానసికంగా ప్రశాంతంగా గడిపితే కొన్ని కోట్ల సంపద ఉన్నట్లే. ఈరోజుల్లో చాలా మంది బిజీ బిజీగా గడుపుతున్నారు. ఉదయం లేచిందంటే ఉరుకుల పరుగులతో కాలాన్ని వెల్లదీస్తున్నారు. దీంతో మానసిక ప్రశాంతతే కరువై అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. అందుకే ఆనందంగా ఉండాలన్నా, ఒత్తిడి నుంచి బయటపడాలి అనుకుంటే తప్పకుండా యోగా చేయాలంట. యోగా అనేది మనసుకు ప్రశాంతతను, మంచి ఏకాగ్రతను ఇస్తుంది. తడసన (పర్వత భంగిమ) : కొన్ని యోగాసనాలు వేయడం వలన మెదడు పనితీరు మెరుగు పడటమే కాకుండా అది మానసిక స్థితిపై మంచి ప్రభావం చూపిస్తుంది. అయితే మానసికంగా ప్రశాంతతను ఇచ్చే ఆసనాల్లో తడసనం ఒకటి. దీనిని వేయడం వలన మెదడుకు రక్తప్రసరణ పెరిగి నాడీవ్యవస్థ పనితీరు బాగుంటుంది. అయితే దీనిని ఎలా వేయాలంటే? నిటారుగా నిలబడి, రెండు చేతులుపైకి లేపి నమస్కరిస్తూ ఉండాలి. శరీరాన్ని పూర్తిగా పైకి వంచాలి. వృక్షాసన (వృక్ష భంగిమ) :మెదడు, కండరాల బలోపేతానికి అద్భుతమైన ఆసనం వృక్షాసనం. దీనిని రెండు పాదాలపై నిలబడి, తర్వాత మరోకాలిని మోకాలిపై వరకు పెట్టాలి. ఒంటి కాలిపై నిలబడి నమస్కారం చేయాలి. ఇలా రోజు 10 నిమిషాలు చేయడం ఆరోగ్యానికి చాలా మంచిదంట. పద్మాసనం : చాలా మంది ఇష్టంగా వేసే ఆసనాల్లో ఇదొక్కటి. ఈ ఆసనం ధాన్య భంగిమలా ఉంటుంది. దీనిని వేయడం వలన మనసుకు ప్రశాంతత కలగడమే కాకుండా, జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందంట. అందుకే ప్రతి రోజూ కనీసం 10 నిమిషాలపాటు ఈ ఆసనం వేయాలి. బాలసనం : బాలాసనం నాడీ వ్యవస్థ సక్రమంగా సాగేలా చేస్తుంది. దీనిని ఎలా వేయాలంటే? మోకాల్లపై వంగి, తలను నేలకు ఆనించి, రెండు అరచేతులను నేలపై ఉంచాలి. కనీసం రెండు నిమిషాల పాటు ఇలా వేయడం వలన శ్వాస సమస్యలు తొలిగిపోతాయంట. త్రతక ఆసనం :శారీరక భంగిమ కాకపోయినా, ఈ యోగ వ్యాయామం కళ్ళు , మనస్సును ఒకే ధాటికి తీసుకొస్తాయి. దీనిని చికటి ప్రదేశంలో ఒక చోట కొవ్వత్తిని వెలిగించి కొద్ది దూరంలో కొర్చొని వెలిగే మంటనే చూడాలి. తర్వాత కళ్లు మూసుకొని దానిని ఊహించుకోవాలి.

# వర్షాకాలంలో వచ్చే వ్యాధులివే.. జాగ్రత్త లేకపోతే కష్టమే!



వర్షకాలం వచ్చిందంటే చాలా వ్యాధులు దండ యాత్ర మొదలు పెడుతాయి. వాతావరణంలో మార్పులు, అధిక తేమ వలన అనేక అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. మరీ ముఖ్యంగా ఈ సీజన్‌లో అంటువ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. మనం తీసుకునే ఆహారం, నీరు ద్వారా వైరస్ సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్తుంటారు వైద్య నిపుణులు.ముఖ్యంగా ఈ సీజన్‌లో టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ఎక్కువగా వస్తాయి. టైఫాయిడ్ వర్షకాలంలో టైఫాయిడ్ ఫీవర్ అనేది ఎక్కువగా వస్తుంది. ఎందుకంటే ఈ సీజన్‌లో కలుషితమైన నీరు, సాల్మొనెల్ల టైఫీ బ్యాక్టీరియా వలన ఈ విష జ్వరం వస్తుంది. కలుషిత మైన ఆహారం, కలుషితమైన నీరు ద్వారా ఈ బ్యాక్టీరియా అనేది వేగంగా వ్యాపిస్తుం దంట. టైఫాయిడ్ వస్తే విప రీతమైన జ్వరం, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి.కొన్ని సార్లు ఇది ప్రాణానికి కూడా ముప్పు తీసుకొస్తుంది. అందుకే ఈ సీజన్‌లో ఆరోగ్యం పట్ల అస్సలే ఆశ్రద్ధ చేయకూడదంట. కలరా , విరేచనాలు : కలరా వ్యాధి అనేది కలు షితమైన నీరు, అపరిశుభ్రమైన ప్రదేశాల వలన త్వరగా వ్యాప్తిచెందుతుంది. ముఖ్యంగా వర్షకా లంలో చాలా మంది దీని బారినపడుతుంటా రు. అందుకే కలరా, విరేచనాల విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతుంటారు ఆరోగ్య నిపుణులు. లెప్టోస్పిరోసిస్ :ఈ బాక్టీరి యల్ ఇన్ఫెక్షన్, ముఖ్యంగా ఎలుకల మూత్రం ద్వారా కలుషితమైన నీటి ద్వారా వ్యాపిస్తుంది. భారీ వర్షపాతం, నీరు నిలిచిపోవడంతో బ్యాక్టీ రియా ఫామై ఈ వ్యాధి వ్యాపిస్తుంటుంది. దీని వలన జ్వరం, విరేచనాలు వంటి సమస్యలు వస్తుంటాయి. డెంగ్యూ, మలేరియా :వర్షకాలం లో వచ్చే అంటు వ్యాధుల్లో డెంగ్యూ, మలేరియా కూడా ఒకటి. ఇవి నీరు నిలిచి ఉండటం, అప రిశుభ్రమైన వాతావరణం, దోమలు, కలుషిత ఆహారం తినడం వలన వస్తాయి. చాలా వరకు వర్షకాలం ప్రారంభైన కొన్ని రోజుల్లోనే ఈ కేసులు విపరీతంగా పెరిగిపోతుంటాయి. దీని లక్షణాలు చూస్తే మొదట చలి జ్వరంతో చిన్నగా మొదలై, తీవ్రంగా జ్వరం వస్తుంటుం ది. తలనొప్పి, బలహీనత, అలసట ఏర్పడుతా యి. చికున్‌గున్యా :వర్షకాలంలో వచ్చే వ్యాధు ల్లో చికున్ గున్యా ఒకటి. ఇది అపరిశుభ్రత వా తావరణం, కలుషిత ఆహారం వలన వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన వారిలో కాళ్లు ఉబ్బడం, కాళ్ల నొప్పులు, విపరీతమైన జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతే కాకుండా ఇది దోమ ద్వారా వ్యాపిస్తుంది. కొన్ని సార్లు ఈ వ్యాధి వచ్చిన వారు దీర్ఘకాలికంగా కూడా ఈ సమస్యలు ఎదర్కొనే అవకాశం ఉంటుందంట.

# ఈ కూరగాయను తక్కువ అంచనా వేయకండి..



అందరూ ఎక్కువగా ఇష్టపడే కూరగాయల లిస్ట్ లో వంకాయ ఉండకపోవచ్చు. కానీ దీనిలో ఉన్న పోషకాల విలువ మాత్రం చాలా ఎక్కువ. ఇది ఎన్నో వ్యాధులతో పోరాడే శక్తిని సహజంగా ఇవ్వగలదు. దీని రుచి నచ్చక తినని వాళ్లైనా.. దీని ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే ప్రతిరోజూ తినే అలవాటు చేసుకుంటారు. రోజువారీ ఆహారంలో మనం ఎన్నో కూరగాయలు వాడుతాం. కానీ కొన్ని సార్లు వంకాయను తినం.. ఎందుకంటే దాని రుచి నచ్చదని అంటాం. కానీ మనం దీన్ని పూర్తిగా తినకపోవడం ఆరోగ్యానికి ఉప యోగపడే గొప్ప ఔషధాన్ని దూరం చేసుకున్నట్లే అవుతుంది. వంకాయలో ఫైటోన్యూట్రియంట్స్ అనే రసాయనాలు మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇవి మెదడులోని నర కణాల మధ్య సంబంధాన్ని బలోపేతం చేస్తాయి. దాని వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. మతిమ రుపు తగ్గుతుంది. ఇందులో ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉండటం వల్ల రోజూ తింటే ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వయస్సు పెరిగే కొద్దీ ఎముకల బలం తగ్గకుండా ఉండాలంటే వంకాయ మంచి సహాయం చేస్తుంది. వంకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, మాంగనీస్ శరీ రంలోని కణాలను రక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కాపాడి.. క్యాన్సర్ కణాలు పెరగకుండా నియంత్రిస్తాయి. వంకాయలో ఐరన్ ఉండటం వల్ల రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిని పెంచే అవకాశం ఉంటుంది. దీన్ని తరచుగా ఆహారంలో చేర్చడం ద్వారా రక్తహీనత (ఎనిమియా) సమస్యలను తగ్గించవచ్చు. నీరసంగా, అలసటతో ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకరం. డయాబెటిస్ ఉన్నవారు కూడా వంకాయ తినవచ్చు. ఇందులో ఉండే పాలిఫినాల్స్ రక్తంలో గ్లూకోజ్ శాతం తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇది తోడ్పడుతుంది. వంకాయలో ఎక్కువగా ఉండే ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలిగిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. ఫలితంగా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఆయుర్వేద నిపుణుల మాటల ప్రకారం.. వంకాయ నిద్రలేమి లాంటి సమస్యలకు సహజ చికిత్సగా ఉపయోగపడుతుంది. ఇది శరీరంలోని అధిక వేడిని తగ్గించి, తల నొప్పి, మలబద్ధకం, గొంతులో గరగర, వాంతులు, శరీరంలో వాపులు, వాత రోగాలకు ఉప శమనం ఇస్తుంది. మొదటి దశలో ఉన్న కిడ్నీ రాళ్లను కరిగించే గుణం కూడా దీనిలో ఉంది. ఈ కూరగాయను మీరు ఇష్టపడకపోయినా.. దీని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం విస్మరించలేనివి. రోజూ వంకాయను తక్కువ మోతాదులో ఆహారంలో చేర్చడం ద్వారా మన ఆరోగ్యాన్ని చాలా మెరుగుపరుచుకోవచ్చు.



# కిడ్నీలు ప్రమాదంలో ఉంటే

## కంటిలో కనిపించే సీక్రెట్ లక్షణాలు



మానవ శరీరంలో కిడ్నీలు కీలక పాత్ర పోషిస్తాయి. శరీ రంలోని విషాన్ని బయటకు పంపిచడంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. అందుకే కిడ్నీల ఆరోగ్యం విషయంలో చాలా జా గ్రత్తలు తీసుకోవాలని సూచిస్తారు ఆరోగ్య నిపుణులు. అయితే ఇప్పుడు న్న జీవన శైలీ, తీసుకుంటున్న ఆహారం కారణంగా చాలా మంది కిడ్నీ ఫెయిల్యూ ర్ వంటి చాలా సమస్యలను ఎదుర్కొంటు న్నారు. అయితే కిడ్నీలు ప్రమాదంలో ఉంటే కళ్లలో పలు లక్షణాలు కనిపిస్తాయంట. ఉబ్బిన కళ్లు : కళ్లు ఉబ్బడం అనేది కొన్నిసార్లు సహజం. అయితే కంటి నిండా నిద్రపోయినా, కళ్లు ఉబ్బినట్లు అనిపిస్తే.. రోజుల తరబడి ఇలానే జరిగితే కాస్త జాగ్రత్తపడాలి అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే. కొన్ని సార్లు మూత్రపిం డాలు దెబ్బతింటే కూడా కళ్లు ఉబ్బినట్లు కనిపిస్తా యంట. దీనిని ప్రోటీన్యూరియా అంటారంట. అందుకే ఈ విషయంలో కాస్త జాగ్రత్త అవసరం. అస్పష్టమైన కంటి చూపు : మూత్రపిండాలు ప్రమాదంలో ఉంటే కంటి చూపు అస్పష్టంగా కనిపిస్తుందంట. ఎందుకంటే? అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలు ఉన్నవారిలో అవి వారి కంటిలోని రక్తనాళాలను కూడా ప్రభావితం చేయడం వలన దృష్టిలో మార్పు వస్తుంది. ఇది మూత్రపిండాలపై కూడా ప్రభావం చూపిస్తుందంట. కళ్లు పొడిబారడం : కళ్లు పొడిబారడం కొన్ని సమయంలో సహజం. కానీ తరచుగా కళ్లు పొడిబారడం, కంటిలో దురద వంటి సమస్యలు తలెత్తే జాగ్రత్తపడాలని చెప్తున్నా రు వైద్యనిపుణులు. ఎందుకంటే మూత్రపిండాల సమస్య తో బాధపడే వారిలో కూడా ఈ సమస్య ఉంటుందంట. కళ్లు ఎక్కువగా ఎరుపు రంగులోకి మారడం : కళ్లకు ఏదైనా గాయం అయినప్పుడు లేదా, దుమ్ము ధూళి పడినప్పుడు మాత్రమే కళ్లు ఎరుపు రంగులోకి మారుతాయి. కానీ మీ కళ్లు ఎప్పుడూ ఎరుపు రంగులో ఉంటే మాత్రం తప్పకుండా ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలంట. కళ్లు ఎరుపు రంగులోకి మారడం మూత్రపిండాల వ్యాధికి ప్రధాన కారణం అంటున్నారు నిపుణులు. కిడ్నీ సమస్య ఉన్నవారు రంగులను చూడటంలో కొన్ని సమస్యలు తలెత్తుతాయంటున్నారు ఆరోగ్య నిపుణులు.మూత్రపిం డాల సమస్యలు ఉన్న కొంతమందికి కొన్ని రంగులను, ముఖ్యంగా నీలం , పసుపు రంగులను వేరు చేయడం కష్టంగా అనిపించవచ్చు. ఇది ఆప్టిక్ నరాల దెబ్బతిన డం లేదా దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా రెటీనాలో మార్పుల వల్ల వస్తుందంట.

# బెడ్ రూమ్‌లో ఉండే ఈ 3 వస్తువులు ఆరోగ్యానికి ప్రమాదం కలిగిస్తాయట..!



పడకగది అనేది శరీరం విశ్రాంతి తీసుకునే ప్రదేశం మాత్రమే కాదు.. మన మానసిక శాంతికి కూడా చాలా అవసరం. కానీ మనం గమనించని కొన్ని వస్తువులు అక్కడ ఉండటం వల్ల నిద్రను దెబ్బతీయడమే కాకుండా.. ఆరోగ్యాన్ని కూడా పాడు చేయ వచ్చు. మీ పడకగదిలో ఉండే కొన్ని మామూలు వస్తువులు మీరు ఊహించనంత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. చాలా మంది దిండ్లు పాతబడినా అలాగే వాడుతూ ఉంటారు. కానీ ఇవి నెమ్మదిగా మీకు సమస్యలు తెచ్చిపెడుతాయి. ఎందుకంటే దిండ్లలో కాలక్రమేణా ధూళి, చెమట, చర్మం నుంచి వచ్చే సూక్ష్మమైన పొడి లాంటివి చేరిపోతాయి. ఇవి అలర్జీలు, చర్మ సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులకు కారణ మవుతాయి. అంతేకాకుండా మంచి నిద్రకు కూడా ఆటంకం కలుగుతుంది. కాబట్టి ప్రతి 1.5 నుంచి 2 సంవత్సరాలకు ఒకసారి కొత్త దిండు తీసుకోవడం మంచిది. అలాగే దిండు కవర్లను వారానికి ఒకసారి శుభ్రం చేయడం అవసరం. చాలా మందికి గదిలో మంచి వాసన రావాలని ఎయిర్ ఫ్రెషనర్లను ఎక్కువ గా వాడుతుంటారు. కానీ ఈ వాసన ఆరోగ్యా నికి మంచిది కాదనే విషయం చాలా మందికి తెలియదు. ఎందుకంటే ఈ ఎయిర్ ఫ్రెషనర్లలో ఫ్తాలేట్స్, బెంజీన్ లాంటి హానికరమైన రసా యనాలు ఉంటాయి. ఇవి శ్వాస సమస్యలు, హార్మోన్ల గందరగోళాలు, కొన్నిసార్లు ప్రత్యుత్ప త్తి వ్యవస్థపైనా చెడు ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా చిన్న పిల్లలున్న ఇంట్లో ఇవి ఎక్కువ ప్రమాదం. సహజంగా మంచి వాసన ఇవ్వగల లెవెండర్, లెమన్ లేదా పుదీనా ఎసెన్షియల్ ఆయిల్స్ ను డిఫ్యూజర్ లో వాడటం మంచి ఎంపిక. అలాగే రోజూ గది కిటికీలు తలుపులు తెరిచి ఉంచితే గాలి మారడం వల్ల గదిలో స్వ చ్ఛత పెరుగుతుంది.పరుపులు ఎక్కువ కాలం వాడినప్పుడు అవి తేమ, ధూళి, సూక్ష్మజీవులు లాంటి వాటితో నిండి ఉంటాయి. దీని వల్ల అల ర్జీలు, దద్దుర్లు, శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. పాత పరుపులు శరీరాన్ని సరైన స్థితిలో ఉంచలేకపోవడం వల్ల నిద్ర సమయంలో నడుము, మెడ నొప్పులు రావచ్చు. నెమ్మదిగా నిద్ర నాణ్యత తగ్గుతుం ది. వైద్యులు చెప్పిన ప్రకారం.. పరుపులను 7 నుంచి 10 సంవత్సరాల మధ్య తప్పనిసరిగా మార్చాలి. అలాగే ప్రతి 6 నెలలకు వాటిని తిప్పడం.. తడి ఆవిరి లాంటివి తగలకుండా చూసుకోవడం కూడా ముఖ్యం. మన శరీరాని కి మంచి నిద్ర చాలా అవసరం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## శాంటో, రహీం అజేయ శతకాలు

బంగ్లాదేశ్, శ్రీలంక జట్ల మధ్య గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టుతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 202527 సైకిల్‌కు తెరలేచింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 292 పరుగులు చేసి పటిష్టస్థితిలో నిలిచింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో, మాజీ కెప్టెన్ ముష్ఫికుర్ రహీం అజేయ శతకాలతో కదంతొక్కారు. దీంతో బంగ్లాదేశ్ తొలి రోజు ఆటలో పైచేయి సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాకు ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్ అనముల్ హక్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. మరో ఓపెనర్ షద్మన్ ఇస్లాం (14) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేకపోయాడు. మాజీ సారథి మోమినుల్ హక్ (29) పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. దీంతో బంగ్లాదేశ్ 45 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. ఈ దశలో కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో, సీనియర్ బ్యాటర్ రహీం అసాధారణ బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు. ఇద్దరు లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు నడిపించారు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన నజ్ముల్ 14 ఫోర్లు, ఒక సిక్స్‌తో 136 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇక రహీం 186 బంతుల్లో ఐదు ఫోర్లతో అజేయంగా 105 పరుగులు చేశాడు. ఇద్దరు ఇప్పటికే నాలుగో వికెట్‌కు అజేయంగా 242 పరుగులు జోడిరచారు.

# టీమిండియాకు పరీక్షలాంటిదే

ఇంగ్లండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ టీమిండియాకు సవాల్ వంటిదేనని చెప్పాలి. ఇంగ్లండ్ గడ్డపై జరుగుతున్న ఈ సిరీస్‌లో భారత్‌కు కష్టాలు తప్పకపోవచ్చు. సీనియర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవిచంద్రన్, మహ్మద్ షమి వంటి సీనియర్లు లేకుండానే భారత్ సిరీస్ బరిలో దిగుతోంది. చాలా కాలంగా భారత క్రికెట్‌లో కీలకంగా ఉన్న ఆటగాళ్లు లేకుండానే సుదీర్ఘమైన టెస్టు సిరీస్‌లో తలపడడం జట్టుకు సవాల్‌గా తయారైంది. సొంత గడ్డపై ఇంగ్లండ్‌కు భారత్‌పై కళ్లు చెదిరే రికార్డు ఉన్న సంగతి తెలిసిందే. బౌన్స్ సహకరించే ఇంగ్లండ్ పిచ్‌లపై భారత్‌కు ఇబ్బందులు ఖాయంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జట్టులో కెఎల్ రాహుల్ ఒక్కడే అనుభవజ్ఞుడైన బ్యాటర్‌గా ఉన్నాడు. కరుణ్ నాయర్ జట్టులో ఉన్నా అతను చాలా కాలం తర్వాత టెస్టు క్రికెట్ బరిలో దిగుతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో జట్టు బ్యాటింగ్ భారమంతా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్, రాహుల్, కరుణ్‌లపైనే నిలిచింది. వీరు ఎలా ఆడతారనే దానిపైనే జట్టు గెలుపోటములు ఆధారపడి ఉన్నాయి. ఇక సిరీస్‌లో అనుభవలేమి భారత్‌కు అతి పెద్ద సమస్యగా మారనుంది. జట్టులో ఇద్దరు ముగ్గురు తప్పిస్తే పెద్దగాఅనుభవం ఉన్న ఆటగాళ్లు పెద్దగా లేరనే చెప్పాలి. సీనియర్లు రోహిత్, కోహ్లి, అశ్విన్‌లు ఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేది. ఆటగాళ్లలో కొత్త ఉత్సాహాన్ని నింపడంలో రోహిత్, విరాట్‌లు ఎప్పుడూ ముందుండే వారు. వారు లేని లోటు సిరీస్‌లో స్పష్టంగా కనిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. వీరి లేకుండానే ఇంగ్లండ్ వంటి క్లిష్ట



మైన సిరీస్ ఆడుతుండడం చాలా క్లిష్టమైన అంశంగా తయారైంది. విశ్లేషకులు సయితం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సిరీస్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే టీమిండియా ముందు సమష్టిగా రాణించడం తప్పించి మరో మార్గం లేదనే చెప్పాలి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కలిసికట్టుగా ముందుకు సాగాలి. కెప్టెన్ శుభ్‌మన్, వైస్ కెప్టెన్ రిషబ్ పంత్‌ల పాత్ర చాలా కీలకంగా మారింది. ఇద్దరు ఒకరికొకరూ సలహాలు, సూచనలు ఇస్తూ జట్టును ముందుకు నడిపించక తప్పదు. రాహుల్, బుమ్రా, జడేజాలు కూడా తమవంతు సహకారం అందించాలి. మరోవైపు సీనియర్ బౌలర్ బుమ్రా ఫిట్‌నెస్ సమస్య జట్టును వెంటాడుతోంది. జట్టుకు చాలా కీలకమైన బౌలర్‌గా ఉన్న బుమ్రాపై భారీ ఆశలున్నాయి. బౌలింగ్ దళాన్ని అతనే ముందుండి నడిపించాల్సి ఉంది. కానీ ఫిట్‌నెస్ సమస్య అతనికి ప్రతికూలంగా మారింది. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తదితరులు కూడా మెరుగైన ప్రదర్శన చేయక తప్పదు. అప్పుడే సిరీస్‌లో భారత్‌కు మెరుగైన అవకాశాలుంటాయి.

## టి20 సిరీస్‌లో అరుదైన రికార్డు

స్కాట్లాండ్ వేదికగా జరుగుతున్న ముక్కోణపు టి20 సిరీస్‌లో అరుదైన రికార్డు నమోదైంది. నేపాల్, నెదర్లాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఫలితం కోసం మూడు సూపర్ ఓవర్లు అనివార్యమయ్యాయి. తొలుత బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. విక్రమ్‌జీత్ సింగ్ (30), తేజ నిడమనూరు (35), సఖిబ్ జుల్ఫికర్ 25 (నాటౌట్) జట్టును ఆదుకున్నారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ టైగా ముగిసింది. ఇక ఫలితం కోసం సూపర్ ఓవర్ నిర్వహించారు. ఈ ఓవర్‌లో ఇరు జట్లూ చెరో 19 పరుగులు చేశాయి. దీంతో మరో సూపర్ ఓవర్ నిర్వహించక తప్పలేదు. ఇందులో కూడా ఇరు జట్లు చెరో 17 పరుగులు సాధించాయి. ఈ పరిస్థితుల్లో ఫలితాన్ని తేల్చేందుకు మూడో సూపర్ ఓవర్‌ను నిర్వహించారు. కానీ ఈసారి నెదర్లాండ్స్ పైచేయి సాధించింది. లయన్ కాచెట్ ఒక్క పరుగు ఇవ్వకుండానే రెండు వికెట్లను పడగొట్టాడు. ఇక తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్ సిక్స్‌తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. కాగా, టి20 చరిత్రలో ఓ మ్యాచ్‌లో ఫలితం కోసం మూడు సూపర్ ఓవర్‌లను నిర్వహించడం ఇదే తొలిసారి. గతంలో చాలా రెండు సూపర్ ఓవర్‌లలో ఫలితం తేలింది. కానీ నెదర్లాండ్స్, డచ్ మ్యాచ్‌లో మాత్రం మూడో సూపర్ ఓవర్‌లో ఫలితం వచ్చింది. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే ఈ మ్యాచ్ చిరకాలం గుర్తుండి పోవడం ఖాయం.




## ఆ ఇద్దరు దిగ్గజాలు కలిస్తే శుభ్‌మాన్ గిల్



ఇంగ్లండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్ కోసం టీం ఇండియా సిద్ధమవుతోంది. ఈసారి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి లేకుండాలనే భారత జట్టు ఇంగ్లండ్‌తో తలపడుతోంది. యువ క్రికెటర్ శుభ్‌మాన్ గిల్ సారథ్యంలో జట్టు బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో శుభ్‌మాన్ జట్టును ఎలా ముందుకు నడిపిస్తాడా.. అనే విషయంపై అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ శుభ్‌మాన్ గిల్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ కలిస్తే శుభ్‌మాన్ గిల్ అని ఆయన అన్నారు. తన పాడ్‌కాస్ట్‌లో బట్లర్ మాట్లాడుతూ.. ''శుభ్‌మాన్ తన ఆటతీరుతో ఆకట్టుకుంటాడు. అతను మాట్లాడేప్పుడు చాలా ప్రశాంతంగా కనిపిస్తాడు.. కానీ, మైదానంలో దూకుడుగా ఉంటాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ కలిస్తే శుభ్‌మాన్ గిల్ అని నా అభిప్రాయం. అతను వారిద్దరి నుంచి ఎంతో నేర్చుకున్నాడు. కానీ, ఆటపై తనదైన సొంత ముద్ర వేస్తాడు. టెస్ట్ క్రికెట్‌కి కెప్టెన్‌గా వ్యవహరించడం దేశంలో మూడో లేదా నాలుగో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి హోదా లాంటిది. గిల్ క్రీజ్‌లో ఉన్నప్పుడు బ్యాటర్‌గా ఉండాలని.. ఆ తర్వాత అతను కెప్టెన్‌గా ఉండాలని కోరుకుంటాడు. అంటే రెండు పాత్రలకు అతను న్యాయం చేస్తాడు'' అని అన్నారు.

## తమిళం కన్నా తెలుగు బేరాలు బాగున్నాయి


ఇంకో మూడు రోజుల్లో విడుదల కాబోతున్న కుబేర మీద అంచనాలు ఎగబాకుతున్నాయి. ఇటీవలే జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో రిలీజ్ చేసిన ట్రైలర్ సినిమా హైప్ విషయంలో బాగా ఉపయోగపడుతోంది. దర్శకుడు శేఖర్ కమ్ముల టిపికల్ స్టైల్ కనిపించినప్పటికీ ఆయన ఫాలో అయ్యే సాఫ్ట్ ఫార్ములా కాకుండా సీరియస్ జానర్ వైపు షిఫ్ట్ కావడం ఆసక్తి రేపుతోంది. అడ్వాన్స్ బుకింగ్స్ అప్పుడే ట్రెండిరగ్ లోకి వచ్చేశాయి. బుక్ మై షో కదలికలు గమనిస్తే తమిళ వెర్షన్ కన్నా తెలుగు అమ్మకాలే వేగంగా ఉండటం గమనార్హం. హైదరాబాద్ ప్రముఖ మల్టీప్లెక్సుల్లో మొదటి రోజు షోలు దాదాపు ఫుల్ అవుతున్న వైనం కనిపిస్తోంది. దీనికి కారణాలు లేకపోలేదు. తమిళ ఆడియన్స్ కుబేరని తెలుగు సినిమాగానే చూస్తున్నారు. బై లింగ్వల్ అయినప్పటికీ శేఖర్ కమ్ముల, నాగార్జున, దేవిశ్రీ ప్రసాద్, రష్మిక మందన్న లాంటి పేర్లు ఆ ఫ్లేవర్ తీసుకొస్తున్నాయి. పైగా ట్రైలర్ సైతం మన నేటివిటీలోనే ఉందని వాళ్ళ ఫీలింగ్. గతంలో సార్ సైతం ఇదే తరహా స్పందన తెచ్చుకోవడం గుర్తు చేసుకోవచ్చు. ఇక్కడ బ్లాక్ బస్టర్



అయితే అక్కడ జస్ట్ హిట్ అనిపించుకుంది. కుబేర సైతం అదే కోవలోకి చేరొచ్చని ట్రేడ్ అంచనా. రెండు మూడు వారాలుగా విపరీతమైన డ్రైతో ఉన్న టాలీవుడ్ బాక్సాఫీస్ కు ఊపిరి పొసే బాధ్యత ఇప్పుడు కుబేర మీదే ఉంది. కుబేరకు తమిళం కన్నా తెలుగులోనే బేరాలు బాగుండటం మంచి విషయమే. టాక్ కనక బాగా వస్తే కనీసం రెండు మూడు వారాలు స్ట్రాంగ్ గా నిలిచేందుకు అవకాశం దొరుకుతుంది. జూన్ 27 కన్నప్ప, జూలై 4 తమ్ముడు ఉన్నప్పటికీ కుబేర కనక యునానిమస్ అనిపించుకుంటే కాంపిటీషన్ పరంగా పెద్దగా టెన్షన్ ఉండదు.

## ‘భూ అంటూ భూతం వస్తే.. ఆగకే అమ్మాడీ’


శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న మూవీ ‘తమ్ముడు’. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ‘భూ అంటూ భూతం..’ను రిలీజ్ చేశారు. మేనకోడలు బేబి దిత్యకు మేనమామ నితిన్ ధైర్యం చెప్పే సందర్భంలో ఈ పాటను చిత్రీకరించారు. ‘భూ అంటూ భూతం..’ పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటీఫుల్‌గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల ఆకట్టుకునేలా పాడారు. సింహాచలం మన్నేలా లిరిక్స్ రాశారు. ‘భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాట లాడాలి. భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ,



ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాట లాడాలి.. పుట్టగానే నేరుగా నువు పరుగెత్తలే, పట్టుకుంటూ పడుతూ నడకేనేర్చావే, భయపడి అడుగు ఆపకే..’ అంటూ సాగుతుందీ పాట అని చిత్ర యూనిట్ తెలిపింది. నితిన్, లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్ దిత్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - కేవీ గుహన్, ఎడిటింగ్ - ప్రవీణ్ పూడి, మ్యూజిక్ - అజనీష్ లోకనాథ్, నిర్మాత - దిల్ రాజు, శిరీష్, రచన -దర్శకత్వం - శ్రీరామ్ వేణు.

## మళ్ళీ సైలెంట్ అయ్యిందేంటి


మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి తర్వాత గ్యాప్ తీసుకున్న అనుష్క కొత్త సినిమా ఘాటీ ఏప్రిల్ 18 నుంచి తప్పుకున్నాక కొత్త డేట్ జూలై 11 తీసుకుంది. ఇప్పుడు చేతిలో నెల రోజులు లేకపోయినా ఇంకా ప్రమోషన్లు మొదలు కాకపోవడం ఫ్యాన్స్ లో అనుమానాలు రేపుతోంది. అదే తేదీకి సుహాస్ ఓ భామ అయ్యో రామాని రిలీజ్ చేయడం చూస్తుంటే స్వీటీ మూవీ మళ్ళీ పోస్ట్ పోన్ అయిందేమోనని డౌట్ రావడం సహజం. యువి క్రియేషన్స్ బ్యానర్ పై క్రిష్ దర్శకత్వంలో రూపొందిన ఈ లేడీ గ్యాంగ్ స్టర్ డ్రామాలో అనుష్క గంజాయి డాన్ గా నటిస్తోంది. ఇప్పటిదాకా ఇంట్రో టీజర్ తప్ప ఎలాంటి ప్రమోషన్ కంటెంట్ వదల్లేదు.ఈ మౌనం వెనుక కొన్ని పరిణామాలు కనిపిస్తున్నాయి. ఘాటీ పోస్ట్ ప్రొడక్షన్ ఇంకా అవ్వలేదు. పనులైతే జరుగుతున్నాయి. క్రిష్ బయటికి కనిపించకపోవడానికి కారణం ఇదే. అయితే హరిహర వీరమల్లు రిలీజ్ డేట్ ఇంకా ఖరారు కాని నేపథ్యంలో రెండిరటి మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉండాలనేది ఘాటీ నిర్మాతల ఆలోచన. ఇంకోవైపు ఈ రెండు ప్యాన్ ఇండియా సినిమాల ఓటిటి హక్కులు అమెజాన్ ప్రైమ్ కొనుక్కుంది.



థియేటర్ రిలీజ్ డేట్లు ఫైనల్ చేసే విషయంలో ప్రైమ్ షెడ్యూల్స్ కీలకం కాబోతున్నాయి. ఆ సంస్థ ప్రతినిధులతో మాట్లాడే ఘాటీ జూన్ 11 తీసుకుందనేది అంతర్గత వర్గాల సమాచారం. ఒకవేళ అదే డేట్ కి కట్టుబడితే మాత్రం వీలైనంత త్వరగా పబ్లిసిటీ మొదలుపెట్టాలి. అనుష్క ఈసారైనా బయటికి వస్తుందో లేదోననేది ఆసక్తికరంగా మారింది. యువి నిర్మిస్తున్న విశ్వంభర సైతం ఇదే తరహా డోలాయమానంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే.

## సీక్వెల్స్ మంత్రం వద్దంటున్న ప్రభాస్


ఇప్పుడంతా సీక్వెల్స్ ట్రెండ్. ఒకప్పుడు టాలీవుడ్ లో పార్ట్ 2 అనే మాట ఉండేది కాదు. మనీతో రామ్ గోపాల్ వర్మ లాంటి నిర్మాతలు ఒకటి రెండు ప్రయత్నాలు చేసినా ఫలితాలు దక్కలేదు. కానీ బాహుబలి మొత్తం మార్చేసింది. కేవలం తెలుగులోనే కాదు అన్ని భాషల్లోనూ కొనసాగింపు జ్వరం అంటించింది. ఇది ఏ స్థాయిలో ఉందంటే రెండో భాగం కోసం సంవత్సరాల తరబడి ఖర్చు పెడుతున్న స్టార్ హీరోలు చాలా ఉన్నారు. కెజిఎఫ్ కోసం యష్ తీసుకున్న గ్యాప్ చిన్నది కాదు. పుష్ప సిరీస్ కోసం అల్లు అర్జున్ వెచ్చించిన సమయం అక్షరాలా అయిదు సంవత్సరాలు. అఫ్కోర్స్ దానికి తగ్గ గొప్ప ఫలితం అందుకోవడం వేరే విషయం. కానీ ప్రభాస్ మాత్రం సీక్వెల్స్ వెంటపడను అంటున్నాడు. ఇప్పటిదాకా సలార్ 2 శౌర్యంగపర్వం ఎప్పుడు మొదలవుతుందో ఎవరికీ తెలియదు. ఇతర నటీనటులు ఎగ్రిమెంట్ తో ఉన్నారు కానీ డార్లింగ్ మాత్రం కొత్త కథల వైపు మొగ్గు చూపుతున్నాడు. కల్కి 2 కోసం దర్శకుడు నాగ్ అశ్విన్ సిద్ధంగా ఉన్నా



ఎప్పుడు స్టార్ట్ చేయాలనేది ప్రభాస్ డేట్స్ మీద ఆధారపడి ఉంటుంది. ది రాజా సాబ్ సింగల్ పార్ట్ ఉంటుందని, బలవంతంగా సీక్వెల్ రుద్దమని దర్శకుడు మారుతీ డైరెక్ట్ గా సంకేతం ఇచ్చాడు. ఫౌజీకి కంటిన్యూయేషన్ ఉండదు ప్రశాంత్ వర్మ తీయబోయే ప్యాన్ ఇండియా మూవీ, సందీప్ వంగా స్పిరిట్ సైతం సింగల్ పార్టని ఇన్ సైడ్ టాక్. ఏదిఏమైనా ప్రభాస్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అభిమానులు, ప్రేక్షకులు ఫ్రెష్ సబ్జెక్టుల్లో తమ హీరోని చూసుకుంటున్నారు. ఒకవేళ ఇవేవి కాకుండా కేవలం సలార్ 2నే స్టార్ట్ అయ్యుంటే ప్రశాంత్ నీల్ వర్కింగ్ స్టైల్ కి మిగిలినవి అసలు స్టార్ట్ అయ్యేవి కాదు.

## పైరసీ బారిన పడితే ఇన్స్యూరెన్స్ వస్తుందా

ఇటీవలి కాలంలో స్టార్ హీరోల సినిమాలకు పైరసీ పెద్ద బెడదగా మారిపోయింది. రిలీజ్ రోజు మధ్యాన్నానికే మంచి హెచ్డి ప్రింట్లు రావడం పట్ల నిర్మాతలు పడుతున్న ఆందోళన అంతా ఇంతా కాదు. దీనికో పరిష్కారం కనుక్కునే దిశగా కొత్త మార్గాలు వెతుకుతున్నారు. వాటిలో ఇన్స్యూరెన్స్ చేయించడం గురించి బాలీవుడ్ లో చర్చలు జరుగుతున్నాయి. ముంబై మీడియా ప్రకారం సల్మాన్ ఖాన్ సికందర్ నిర్మాణ సంస్థ తమ చిత్రం పైరసీ బారిన పడటం వల్ల జరిగిన నష్టానికి గాను తొంభై కోట్ల క్లెయిమ్ ని కోరే ఆలోచనలో ఉందట. ముందు రోజు రాత్రే ఈ మూవీ తాలూకు ఒరిజినల్ వెర్షన్లు ఆన్ లైన్ లో ప్రత్యక్షమైన సంగతి తెలిసిందే. ఇది మాటల్లో చెప్పుకున్నంత సులభం కాదు. ఎందుకంటే పైరసీ ప్రమాదాన్ని ముందే గుర్తించి ఇన్స్యూరెన్స్ చేయించినా సదరు కంపెనీలు గుడ్డిగా సొమ్ములు చెల్లించవు. లోతైన పరిశీలన చేస్తాయి. నిర్మాత స్వంత ప్రాపర్టీ అయిన సినిమా అసలు బయటికి ఎలా వచ్చిందనే దాని మీద విచారణ



కోరతారు. పోలీసుల ఇన్వెస్టిగేషన్ కు సంబంధించిన రిపోర్టులు సమర్పించాల్సి ఉంటుంది. ప్రొడక్షన్ కాస్ట్, సినిమా మీదున్న అంచనాలు, బిజినెస్ తాలూకు ఆధారాలు, బుక్ మై షో ట్రెండిరగ్ గట్రా వ్యవహారాలు ఇలా రకరకాల ఆడిట్లను చేయించి ప్రొడ్యూసర్ తప్పేమి లేకుండానే డ్యామేజ్ జరిగిందని తేలితే అప్పుడు క్లెయిమ్ ఇస్తారు. ప్రస్తుతానికి సికందర్ బృందం ఇంకా ఇన్స్యూరెన్స్ కోసం అప్ప్లై చేయలేదు కానీ ప్రతిపాదన మాత్రం సీరియస్ గా ఉందట. ఏదైనా విపత్తు జరిగినప్పుడు కాంపెన్సేషన్ డిమాండ్ చేయడం సబబే కానీ ఇలా ఇంటి దొంగలు ఎక్కువగా ఉండే పైరసీ లాంటి సమస్యలకు పరిష్కారం అంత సులభంగా ఉండదు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in